

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176


epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 277 | ది. 13-1-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 277 | Date : 13-1-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |



## నారావారిపల్లె కు సీఎం చంద్రబాబు



**అమరావతి,జనవరి 12 (వార్తాప్రభ) :** సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్వగ్రామం నారావారిపల్లెకు వెళ్లారు. ఏటా కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునే సీఎం చంద్రబాబు.. ఈ ఏడాది కూడా స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లతో సచివాలయంలో సమీక్షా సమావేశం అనంతరం సాయంత్రం నారావారిపల్లెకు చేరుకున్నారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నేతలతో కలిసి రేపు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. మంగళవారం నారావారిపల్లెతో పాటు తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తారు.

# 2026లోనూ ఉత్తమ ఫలితాలే సాధిద్దాం

- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సుతో బెస్ట్ రిజల్ట్స్
- పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం ఏపీ
- 16 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా కార్యాచరణ
- విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.1.19 తగ్గించటం లక్ష్యం
- ఈ ఏడాదిలోనే ల్యాండ్ రికార్డుల పూర్తి ప్రక్షాళన
- వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ సమర్ధ వినియోగంతో కమ్యూనిటీ ఆస్తుల పెరుగుదల
- గత పాలకులది తిరుమల పవిత్రను దెబ్బతీసే కుట్ర
- తిరుమలలో మద్యం బాటిళ్లు పెట్టి దుర్మార్గానికి పాల్పడ్డారు
- మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు




**అమరావతి,జనవరి 12 (వార్తాప్రభ) :** సవాళ్లను అధిగమించి 2025లో సాధించిన ఫలితాలకు మించి ఈ ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధించేలా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విధ్వంసమైన వ్యవస్థలను గాడిన పెట్టి సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. 2025 ఏడాదిలో మంచి ఫలితాలతో ప్రజల ఆశల్ని నిలబెట్టి విశ్వాసాన్ని మళ్లీ నింపామని తెలిపారు. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయంలోని 5వ బ్లాకులో మంత్రులు, సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా హాజరయ్యారు.

**సంక్షేమ పాలనకు మరొక మైలురాయి..** గత ప్రభుత్వ విధానాలతో కనీసం అప్పు తీసుకునే వెసులుబాటు కూడా లేని పరిస్థితి నుంచి సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని సీఎం చంద్రబాబు అన్నారు. 'తల్లికి వందనం ద్వారా రూ.10,090 కోట్లను 67 లక్షల మంది విద్యార్ధుల తల్లుల ఖాతాలకు వేశాం. స్త్రీశక్తి ద్వారా 3.5 కోట్ల ప్రయాణాలు మహిళలు చేశారు. దీని కోసం ఇప్పటి వరకూ రూ.1114 కోట్లు వ్యయం చేశాం. అన్నదాత సుఖీభవ ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు జమ చేశాం. దీపం 2.0 ద్వారా 2 కోట్ల సిలిండర్లను ఇప్పటికి పంపిణీ చేయగలిగాం. దీనికి రూ.2684 కోట్లు వ్యయం చేశాం. ఏడాదిన్నరలో రూ.50 వేల కోట్ల మేర సామాజిక పెన్షన్లను అందించటంలో సంక్షేమంలో కొత్తమైలు రాయిని సాధించాం. 70 వరకూ పెద్ద పథకాలు, కార్యక్రమాలు, పనులు చేశాం. సంక్షేమ పాలనలో మరో మైలురాయిని దాటాం' అని సీఎం అన్నారు.


**పోలవరం పూర్తైతే ఏ రాష్ట్రమూ పోటీ పడలేదు..**

గత పాలకులు అమరావతిని స్మశానం, ఎడారని ఎగతాళి చేశారని, కానీ ఇదొక స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. 'పోలవరం అత్యద్భుతమైన ప్రాజెక్టు, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదు. ప్రతీ ఏటా 3 వేల టీఎంసీల మేర నీరు వృధాగా సముద్రంలోకి వెళ్తోంది. పట్టి సీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వటం ద్వారా శ్రీశైలంలోని నీటిని పొదుపు చేసి రాయలసీమకు ఇస్తున్నాం. నల్లమల సాగర్ ద్వారా రాయలసీమ, ప్రకాశం తదితర ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఎవరికీ నష్టం లేదు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్ కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటి. పోలవరంలో మిగిలిన నీళ్లు తెలంగాణా రాష్ట్రం కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రాజెక్టులు కట్టినప్పుడు నేనెప్పుడు అడ్డు చెప్పలేదు. రెండు తెలుగు రాష్ట్రాలూ గోదావరి జలాలను సమర్ధంగా వినియోగించుకోవచ్చు. పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును నిర్మించి జాతికి అంకితం చేస్తాం' అని అన్నారు.

**త్వరలో భోగాపురం విమానాశ్రయం జాతికి అంకితం..**

విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న ఎయిర్ పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర సాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.12 వేల కోట్ల రాబట్టి కాపాడుకున్నామని అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ ఆ ప్లాంట్ ను నిలబెట్టి తీరుతామని ఉద్ఘాటించారు. 'దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయి. పెట్టుబడులకు డెస్టినేషన్ గా ఆంధ్రప్రదేశ్ మారింది. సీఐఐ ద్వారా చేసుకున్న ఒప్పందాలు అన్నీ సాకారం అయితే 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎస్ఐపీబీ ద్వారా 8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం కూడా ఇచ్చాం. వీటి ద్వారా కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయి. గూగుల్ కూడా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్ ను విశాఖలో ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రానికి పెట్టుబడులు రావటంలో కృషి చేసిన అధికారులు, ప్రభుత్వ విభాగాలను అభినందిస్తున్నాను. అమరావతిలో క్వాంటం వ్యాలీకి త్వరలో ఫౌండేషన్ వేస్తాం. ఆరు నెలల్లో క్వాంటం కంప్యూటర్ ఇక్కడి నుంచి పనిచేస్తుంది. విద్యుత్ కొనుగోలు ధరను గణనీయంగా తగ్గించగలిగాం. భవిష్యత్తులో రూ.1.19 పైసల మేర యూనిట్ కొనుగోలు ధర తగ్గించటం లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రిజర్వాయర్‌లలోనూ 970 టీఎంసీలను నింపగలిగాం. రాయలసీమలోనూ పెద్ద ఎత్తున నీటిని నిలిపాం' అని అన్నారు.

## ఉద్యోగులకు సీఎం రేవంత్ సంక్రాంతి భారీ కానుక - ఖాతాల్లోకి బకాయిలు..!!



**హైదరాబాద్,జనవరి 12 (వార్తాప్రభ) :** సంక్రాంతి వేళ ఉద్యోగులకు సీఎం రేవంత్ తీపి కబురు అందించారు. సుదీర్ఘ కాలంగా ఉద్యోగ సంఘాల నేతలు చేస్తున్న వినతులకు సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులు చాలా రోజులు గా పెండింగ్ డీఏలతో పాటుగా బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. దీని పైన ప్రభుత్వంతోనూ చర్చలు చేసారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రతీ నెలా కొంత మేర బకాయిలను ప్రభుత్వం విడుదల చేస్తోంది. కాగా, ఇప్పుడు సంక్రాంతి వేళ ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేస్తూ సీఎం రేవంత్ సంతకం చేసారు. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటన చేసారు. ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేస్తున్నట్లు వెల్లడిం చారు. 3.64 శాతం మేర ఈ డీఏ విడుదల కానుంది. పెంచిన డీఏను 2023 నుంచి అమల్లోకి వస్తుంది. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం పైన రూ 227 కోట్ల భారం పడనుందని వివరించారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమాను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని 5.14 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలకు భరోసా లభిస్తుంది. రాష్ట్రంలోని రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు వివరించారు. ఉద్యోగుల బకాయిలను సైతం త్వరలో పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పదవీ విరమణ ప్రయోజనాలను సాధ్యమైనంత త్వరగా అందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేసారు. దీని పైన ప్రభుత్వ ంతోనూ చర్చలు చేసారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రతీ నెలా కొంత మేర బకాయిలను ప్రభుత్వం విడుదల చేస్తోంది. కాగా, ఇప్పుడు సంక్రాంతి వేళ ఉద్యోగులకు ఒక డీఏ విడుదల చేస్తూ సీఎం రేవంత్ సంతకం చేసారు. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. పెంచిన డీఏను 2023 నుంచి అమల్లోకి వస్తుంది.

# హైవే నిర్మాణంలో ప్రపంచ రికార్డులు గర్వకారణం

- బీకేవీకి అమరావతి-బెంగుళూరు కారిడార్ పేరు పెట్టండి: సీఎం చంద్రబాబు
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో వేగంగా పనులు
- చంద్రబాబు తన జీవితాన్ని ప్రజా శ్రేయస్సుకు అంకితం చేశారు : కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- బీకేవీ గిన్నీస్ రికార్డు వర్చువల్ కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరైన సీఎం, కేంద్రమంత్రి



**అమరావతి,జనవరి 12 (వార్తాప్రభ) :** కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో రహదారుల నిర్మాణంలో ప్రపంచ స్థాయిలో రికార్డులను సాధించటం గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బెంగుళూరు- విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో నాలుగు గిన్నీస్ రికార్డులు సాధించడంపై సత్యసాయి జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్ల అందరితో కలిసి ఈ ఉమ్మడి విజయంలో వర్చువల్‌గా పాల్గొంటున్నాం. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పనిచేసే వేగం, సామర్ధ్యం దేశంలో అందరికీ పరిచయమే. రాజ్ పథ్ ఇన్ ఫ్రా కామ్ సంస్థను కూడా ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. వేగంగా అత్యంత పొడవైన బిటుమిన్‌తో కూడిన 6 లేన్ల జాతీయ రహదారిని వేగంగా నిర్మించి గిన్నిస్ రికార్డును సాధించారు. 10,655 మెట్రిక్ టన్నుల బిటుమిన్ కాంక్రీట్ నిరంతరాయంగా వేస్తూ మరో ప్రపంచ రికార్డు సాధించారు. జనవరి 6 నుంచి 11 వరకూ ఏక బిగిన 52 కిలోమీటర్ల మేర 6 లేన్ కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. అలాగే 84.4 కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారిని నిర్మించిన రికార్డును తిరగ రాశారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్‌వేలు 10 వేల కిలోమీటర్ల మేర వేగంగా చేపడుతున్నారు. అమరావతి నుంచి బెంగుళూరు కు నేరుగా రోడ్డును వేయాలని నిర్ణయించాం. కొత్తగా నిర్మిస్తున్న ఈ కారిడార్ కు అమరావతి బెంగుళూరు రోడ్డుగా దీనిని పేరు పెట్టాలని కోరుతున్నాను. బృందంగా పనిచేసి విజయం సాధించిన అందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను' అని సీఎం అన్నారు.

**నేషనల్ హైవే ప్రాజెక్టులు చేపట్టేందుకు ఏపీ నుంచి పూర్తి సహకారం : కేంద్రమంత్రి..** భగవాన్ సత్యసాయి ఆశీర్వాదంతో బెంగళూరు-విజయవాడ కారిడార్ నిర్మాణంలో ప్రపంచ రికార్డులను సాధించగలిగామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. 'సత్యసాయి జిల్లాలో బెంగుళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో 4 గిన్నీస్ రికార్డులు సాధించటంపై అందరికీ అభినందనలు తెలియజేస్తున్నా. ఎక్కడా నాణ్యతలో రాజీ లేకుండా వేగంగా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. కొత్త ఆవిష్కరణల ద్వారా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాం. వరిగడ్డి ద్వారా బిటుమిన్ తయారీకి సంబంధించి కొత్త ఆవిష్కరణ చోటు చేసుకుంది. దానిని ఉపయోగించటంలో ఏపీ కూడా భాగస్వామి కావాలని కోరుతున్నాను. నైపుణ్యం, ఆవిష్కరణలు, మేధోపరమైన ఆలోచనలు నాణ్యత పెంచి వ్యయాన్ని తగ్గించాలి. అదే సమయంలో పర్యావరణాన్ని కాపాడుతూ కాలుష్య రహిత విధానాలు అవలంబించాల్సి ఉంది. అందుకే జాతీయ రహదారుల సంస్థలో ఈ గిన్నీస్ వరల్డ్ రికార్డులను సాధించగలిగాం.

# సమాచార శాఖ కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు




**విజయవాడ,జనవరి 12 (వార్తాప్రభ) :** సంక్రాంతి పండుగ కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, అనురాగాలను పెంచి నూతనోత్సాహంతో ముందుకు సాగుతూ, వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మరిన్ని విజయాలను సాధించాలని సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎల్. స్వర్ణలత ఆకాంక్షించారు.. సమాచార పౌర సంబంధాల శాఖ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనం రెండో అంతస్థు డైరెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగులు సాంప్రదాయ దుస్తులతో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంప్రదాయబద్ధంగా రంగోలీ ముగ్గులు, రంగవల్లులు, చెరకు గడలు, బొమ్మల కొలువు, భోగిపళ్లు, గాలిపటాలు, సాంప్రదాయ బంతిపూలతో కార్యాలయాన్ని పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా అలంకరించారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు స్వర్ణలత మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ ఉత్సాహం ప్రతి ఉద్యోగి కుటుంబంలోనూ ఆనందంతో వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. తన చిన్ననాటి సంక్రాంతి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇంటి ముందు ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టడం, తెల్లవారుజామున భోగి మంటలు వేసుకుని చలి కాచుకుంటూ సంబరాలు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉండేదని అదనపు సంచాలకులు ఎల్. స్వర్ణలత తెలియజేశారు. జాయింట్ డైరెక్టర్ కె. కిరణ్ కుమార్ మాట్లాడుతూ... సంక్రాంతి అంటే సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశికి ప్రవేశించే శుభ సందర్భమని, దీనివల్ల ఋతువుల్లో మార్పులు, కొత్త పంటలు, కుటుంబ సభ్యుల కలయిక జరుగుతాయని వివరించారు. సంక్రాంతి పండుగకు మన తెలుగు సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉందని, ఎక్కడ ఉన్నా ప్రతి ఒక్కరూ తమ జన్మభూమిని చేరుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే పండుగ సంక్రాంతేనని పేర్కొన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కొత్త సంప్రదాయం భవిష్యత్తులోనూ కొనసాగాలని జాయింట్ డైరెక్టర్ కె. కిరణ్ కుమార్ ఆకాంక్షిస్తూ ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఛీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూధన్ మాట్లాడుతూ.. సంక్రాంతి నుండి సూర్యుడు ఉత్తరం వైపు మళ్లడం (ఉత్తరాయణం) ఒక శుభ సూచకమని అన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల కలయికతో ఈ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్యచంద్రరావు, ఆర్ఐఈ డాక్టర్. టి. నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు బి. పూర్ణచంద్రరావు, పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు పి. రాజశేఖర్, ఏఎస్ వీరభద్రరావు, కే. నారాయణ రెడ్డి, ఎస్వీ మోహన్ రావు, ఏవో పి. సుదర్శనరావు, జేఈవో నాగరాజు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంది

- "వార్తా ప్రభ" క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి కొలుసు పార్ధసారథి.
- ప్రభుత్వం జర్నలిస్టుల సొంత ఇంటి కలను త్వరలో సాకారంకు విధి విధానాలు ఖరారు చేయనుంది: మంత్రి పార్ధసారథి



**నూజివీడు,జనవరి 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నూజివీడులో"వార్తాప్రభ - 2026" క్యాలెండర్ ను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలు పాడిపంటలతో తులతూగాలని మంత్రి పార్ధసారథి ఆకాంక్షించారు. మంత్రి పార్ధసారథి మాట్లాడుతూ "వార్త ప్రభ" పత్రిక స్వేచ్ఛగా, ప్రజా సమస్యలను తెలుగులోకి తీసుకురావాలని సూచించారు. మీడియా సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో విలేకరుల సంక్షేమానికి తప్పకుండా కృషి చేస్తామని మంత్రి పార్ధసారథి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు హెల్త్ కార్డులు కూడా అందిస్తామన్నారు. రానున్న రోజుల్లో జర్నలిస్టు సోదరులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, జర్నలిస్టులకు త్వరలో గృహాలు కూడా నిర్మించి అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పట్టణ టీడీపీ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, కౌన్సిలర్ కొమ్మని విజయ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బర్రె ఇళయరాజా, ముత్యాల కామేష్, టిడిపి సీనియర్ నాయకులు యనమదల సత్యనారాయణ, గద్దె రఘు, అరికోటి సంగీతరావు, పాశల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద..

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏకే భాషా ఘన నివాళి




**విజయవాడ లీగల్,జనవరి 12 (వార్తాప్రభ) :** స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈరోజు బెజవాడ బార్ అసోసియేషన్ లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా అని వాళు లర్పించారు. ఈ సందర్భంగా బెజవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎ కె బాష మాట్లాడుతూ స్వామి వివేకానందుడు భారతీయ సంస్కృతి ఆధ్యాత్మికత జాతీయ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు అని అంతేకాకుండా వివేకానంద, రామకృష్ణ మిషన్ ను స్థాపించి యువతకు స్ఫూర్తిని ఇచ్చారని ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవం గా కూడా జరుపుకుం టారని , ఆయన ఆలోచనలు నేటికీ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని స్వామి వివేకానంద ఘనతను వివరించారు. ఈ కార్యక్రమానికి గవర్నింగ్ బాడీ, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ మరియు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొని స్వామి వివేకానంద కి నివాళులర్పించారు

## విద్యుత్ కార్మికుల సంక్షేమమే 1104 యూనియన్ ధ్యేయం

**ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ**




**ఇబ్రహీంపట్నం, జనవరి 12 (వార్తాప్రభ) :** విద్యుత్ కార్మికుల సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) ప్రధాన ధ్యేయం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య అన్నారు. ఇబ్రహీంపట్నం ఏ కాలనీ క్రీడా మైదానంలో ఏపీఈఈ యూనియన్ (1104) క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1104 యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా పనిచేయడం లేదన్నారు. ఈ ఏడాది యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకుని 76 వసంతంలోకి అడుగుపెడుతుందని, ఇది అందరికీ గర్వకారణమన్నారు. కార్మిక సమస్యలపై యాజమాన్యంతో చర్చలు జరుపుతామని, అయితే ఎక్కడ ప్రాధేయపడే అవసరం లేదని స్పష్టం చేశారు. గత నెలలో యూనియన్ ఇచ్చిన సమ్మె నోటీసు అనంతరం యాజమాన్యంతో జరిగిన చర్చల ఫలితంగా గతంలో కోల్పోయిన హక్కులను తిరిగి సాధించుకోవడం సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రస్తుతం కార్మికుల ముందు ఉన్న అతిపెద్ద సమస్య పే రివిజన్ అని, ఇందులో గతంలో జరిగిన నష్టాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ఆర్.కె. గణపతి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో అధికారుల నుంచి సాధారణ కార్మికుల వరకు నేడు అనుభవిస్తున్న అనేక ప్రయోజనాలు సాధించిన ఘనత 1104 యూనియన్ దేనన్నారు. అనంతరం యూనియన్ డైరీ, క్యాలెండర్ ను రాష్ట్ర సలహాదారుడు ఎస్.శోభనాద్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శులు ఎం.వీరాంజనేయులు, కె.శ్రీనివాసులు, అన్ని డిస్కంల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రాంతీయ కార్యవర్గ అధ్యక్షుడు డి.వి.రమణ, కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి కేసీఆరే రక్షకుడు!!

● ముగ్గుల్లో 'జై తెలంగాణ - జై కేసీఆర్ణ నినాదాలు ● ఆడబిడ్డలను కంటికి రెప్పలా కాపాడిన ఘనత "కేసీఆరుదే ● నాడైనా నేడైనా ప్రజలకు అండ గులాబీ జెండానే ● రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్







**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 12 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసి, ఆడబిడ్డలను కంటికి రెప్పలా కాపాడిన ఘనత తొలి ముఖ్యమంత్రి "కేసీఆరుకే దక్కుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని జీఎం కాలనీ మైదానంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ముగ్గులను తిలకించి విజేతలకు బహుమతుల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో కళ్యాణ లక్ష్మి ద్వారా 1,11,116 రూపాయలు అందించడమే కాకుండా, బతుకమ్మ చీరలతో ఆడబిడ్డలకు గౌరవాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. నాడైనా నేడైనా ప్రజలకు అండ గులాబీ జెండానే అని తెలిపారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళలకు చేకూరిన ప్రయోజనం శూన్యమని, కనీసం బతుకమ్మ చీరలు కూడా పంపిణీ చేయలేకపోయారని విమర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు ప్రథమ బహుమతి పద్మ (రూ. 10,000/-), ద్వితీయ బహుమతి దుర్గం రేణుక (రూ. 5,000/-), తృతీయ బహుమతి దివ్య (రూ. 3,000/-) అలాగే పోటీలో పాల్గొన్న సుమారు 100 మంది మహిళలకు స్వయంగా చీరలను పంపిణీ చేశారు చందర్. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వివేకానందుని అడుగుజాడల్లో నడవాలి - భాస్కర్ రెడ్డి




**కూకట్ పల్లిజనవరి13(వార్తాప్రభ):**కూకట్ పల్లి సర్కిల్ వివేకానంద నగర్ డివిజన్‌కు చెందిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందుని ఆదర్శాలను ఆచరించి ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.సోమవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని, వివేకానంద నగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి భాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు స్వామి వివేకానంద బోధనలు మార్గదర్శకమని, జాతీయ ఐక్యత,సేవా భావం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు విజయభాస్కర్ రెడ్డి,చంద్రారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నరసయ్య, సూర్యప్రకాశ్ రావు తదితరులు పాల్గొని స్వామి వివేకానందునికి ఘనంగా నివాళులు అర్పించారు.

## ఘనంగా మాజీ మంత్రి పిజిఆర్ జన్మదిన వేడుకలు




**శేరిలింగంపల్లి,జనవరి 12 (వార్తాప్రభ):** బడుగువేడుకలువర్గాల ఆశాజ్యోతి,కార్మిక నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి,సీఎల్పీ నాయకుడు, మహనీయులు పి జనార్ధన్ రెడ్డి 78 వ జయంతి సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీ లో గల వారి విగ్రహానికి పూలమాల వేసి పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ కార్మిక లోక బాంధవుడు స్వర్గీయ పిజేఆర్ భౌతికంగా మనకు దూరమైనా,ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత పిజేఆర్ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్నాను అని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు.పిజెఆర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,కార్మిక నాయకుడు,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు, సీఎల్పీ నాయకుడిగా పనిచేశారని,ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి అనునిత్యం ప్రజల కోసం పరితపించే ప్రజా నాయకుడు పిజెఆర్ ని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.నిత్యం పేద ప్రజల బాగు కోసం పరితపించే గొప్ప నాయకుడు అని దానికి తోడు తన రాజకీయ జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచిందని నిరుపేదలకు కూడు,గూడు ఎంత అవసరమో గుర్తించి కూడు,గూడు కల్పించిన మహనీయుడని పీజేఆర్ సేవలను పిఏసీ చైర్మన్ గాంధీ కొనియాడారు.పిజెఆర్ రాజకీయాలలో కొత్త ఒరవడిని సృష్టించారు అని, పిజెఆర్ జీవితం ఎంతో మందికి ఆదర్శం అని,నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని,ఆయన ఆశయాలను కొనసాగించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,మహిళలు,కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలి పగను మించుతున్న క్లబ్బు పగ!!

● జర్నలిజంలో 'క్లబ్ణ కుంపటి ● రిపోర్టర్ల మధ్య చిచ్చు పెడుతున్న ఆధిపత్య పోరు ● పెద్ద మీడియా వర్సెస్ చిన్న మీడియా ● క్లబ్ సభ్యత్వం ఉంటేనే జర్నలిస్టులా? ● అక్కసు.. పెత్తనం.. ఆరోపణలు.....నిందలు ● మీడియా ముసుగులో 'క్లబ్' రాజకీయం ● తెర చాటున జరుగుతున్న అసలు కుట్ర కథ!!




**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 12 (వార్తాప్రభ ప్రతినిధి)**సాధారణంగా రాజకీయాల్లో పాలి పగలు (దాయాదుల పోరు) ఉంటాయని అంటుంటారు. కానీ ప్రస్తుత మీడియా రంగంలో ఆ పాలి పగలను మించి 'క్లబ్బు పగలు' పెరిగిపోతున్నాయి. జర్నలిస్టుల మధ్య ఉండాల్సిన ఐక్యత పోయి, 'క్లబ్ణ సభ్యత్వం ఉన్నవారు, లేనివారు అనే విభజన రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.చిన్న మీడియాపై పెత్తనంపెద్ద మీడియా సంస్థల్లో పనిచేస్తూ, ప్రెస్ క్లబ్‌లలో సభ్యత్వం ఉన్న కొందరు జర్నలిస్టులు.. చిన్న మీడియా సంస్థల రిపోర్టర్లపై పూర్తిస్థాయిలో అక్కసు వెళ్లగక్కుతున్నారనే ఆరోపణలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. క్లబ్ సభ్యత్వం లేని నాన్-క్లబ్ రిపోర్టర్లను తక్కువ చేసి చూడటం, వారికి అందాల్సిన గౌరవాన్ని, అవకాశాలను అడ్డుకోవడం ఇప్పుడు పరిపాటిగా మారింది. ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర ప్రయోజనాలు అన్నీ కేవలం ఒక వర్గానికే (క్లబ్ సభ్యులకు) పరిమితం కావాలనే ధోరణి కనిపిస్తోంది. చిన్న మీడియా ప్రతినిధులను అధికారిక కార్యక్రమాల నుంచి తప్పించడం, వారికి సమాచారం అందకుండా చేయడం వంటి కుట్రలు క్లబ్ రాజకీయాల పుణ్యమే. ఈ వర్గ పోరు వల్ల నిజమైన వార్తలు సమాధి అవుతున్నాయి. జర్నలిజం విలువలను గంగలో కలిపి, కేవలం స్వలాభం కోసం పాకులాడుతున్న ఈ 'క్లబ్ మాఫియా' ఆగడాలకు అడ్డుకట్ట పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్షేత్రస్థాయిలో కష్టపడే రిపోర్టర్లకు మొండిచేయి చూపుతూ, కేవలం హోదాల పేరుతో కొందరు వ్యక్తులు ప్రయోజనాలన్నింటినీ గుప్పిట పట్టుకుంటున్నారని చిన్న మీడియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వార్తల కోసం తిరిగే సామాన్య రిపోర్టర్ల కన్నా, పెత్తనం చెలాయించే వారికే ప్రాధాన్యత దక్కడం జర్నలిజం విలువలను దిగజారుస్తోంది. వార్తలను ప్రజలకు చేరవేయడంలో అందరూ సమానమే అయినప్పుడు, ఈ క్లబ్ రాజకీయాలు ఎందుకు? అని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ వర్గ పోరు ఆగి, జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉంటేనే వృత్తికి గౌరవం దక్కుతుంది. అధికార గర్వం, క్లబ్ సభ్యత్వ అహంకారం ఉన్న కొందరి వల్ల మొత్తం జర్నలిస్ట్ వ్యవస్థకే చెడ్డపేరు వస్తోంది. ఇప్పటికైనా ఈ ఆధిపత్య పోరును వీడి, తోటి జర్నలిస్టులను గౌరవించడం నేర్చుకోకపోతే.. కాలమే వీరికి బుద్ధి చెబుతుంది.

# కోడిపందాలు, పేకాట ఆడితే కటకటాలే!!

● నిఘా కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు ● సరిహద్దుల్లో భారీగా నాకాబందీలు, వాహన తనిఖీలు ● సమాచారం ఇవ్వడానికి డయల్ 100కు కాల్ చేయండి ● రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 12 (వార్తాప్రభ ప్రతినిధి)**సంక్రాంతి సంబరాల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక నిఘా సారించింది. పండుగ పూట సరదా పేరుతో కోడిపందాలు, పేకాట వంటి జూద క్రీడలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. పండుగ సీజన్‌లో పొరుగు ప్రాంతాల నుండి అక్రమ రవాణా, జూదరుల రాకపోకలను అరికట్టడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేశామని ప్రకటనలో వివరాలను వెల్లడించారు సీపీ. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని సిపి పేర్కొన్నారు. మీ పరిసరాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

# దేశానికి యువత అమూల్యమైన సంపద

**బిజెపి ఇన్చార్జ్ ఏం. రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,జనవరి 12 (వార్తాప్రభ):**స్వామి వివేకానంద 164 వ జయంతి సందర్భంగా మదీనాగూడ మైత్రి నగర్ కమాన్ వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి హఫీజ్ పెట్ డివిజన్ అధ్యక్షులు జితేందర్ మియాపూర్ డివిజన్ అధ్యక్షుల ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులందరికి నేషనల్ యూత్ డే శుభాకాంక్షలు తెలిపారు,మన దేశానికి యువత అమూల్యమైన సంపద,దేశ అభివృద్ధి లో కీలక పాత్ర యువతదే అని అన్నారు,అతి చిన్న వయస్సులో 1893 లో స్వామి వివేకానంద పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రిలీజియన్స్ లో ప్రసంగించి మన దేశ సంస్కృతిని తత్వాన్ని ప్రవేశ పెట్టిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు,ఆయన మన ఉపదేశించిన వాఖ్యాలు కెరటం నాకు ఆదర్శం లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు, ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు, ఉక్కు సంకల్పం కలిగిన యువత, మందలో ఉండకు ..వందలో ఉండటానికి ప్రయత్నించు..ఇలాంటి గొప్ప సూక్తులు ఇప్పటికీ స్ఫూర్తి ని అందిస్తూనే ఉన్నాయన్నారు,మనమందరం ఆ యువ వయస్సు నుండి వచ్చిన వాళ్ళమే ప్రతి అడుగు ప్రణాళికాబద్ధంగా తెలివిగా ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు,ఈ వయస్సులో మనం ప్రశ్నించే గుణం అమర్చుకోవాలని,దేశ సామాజిక సంస్కరణలు మరియు దేశ అభివృద్ధి యువత చేతుల్లో ఉందన్నారు,దేశంలోని యువత లేకుండా మనం మార్పులు,పురోగతి సాధించలేమని,ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువతరం భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు,ఒక గోల్ ను ఎంచుకుని ఏకాగ్రతతో దానిని సాధించేవరకు ప్రయత్నిస్తూనే ఉండాలన్నారు,ఈ కార్ర్యమంలో నాయకులు నాగేశ్వర్ గౌడ్,మహేష్ యాదవ్,మాణిక్ రావు,అజిత్ సేనాధిపతి,కోటేశ్వరరావు, మనోహర్ ,శ్రీధర్ గౌడ్,విష్ణు,సత్యనారాయణ రాజు,రవి గౌడ్,రమణయ్య సురేష్,శ్రీనివాస్ యాదవ్,గణేష్ ముదిరాజ్,రాజేష్ గౌడ్,వర ప్రసాద్,వేణుగోపాల్ రెడ్డి,శివారెడ్డి,విజయేందర్ ,పట్టాభిరామ్ శివరాజ్ ముదిరాజ్,వినోద్ యాదవ్,పవన్,బాబు ముదిరాజ్,రాము,మహేందర్ యాదవ్,ప్రసాద్,రాము యాదవ్,నగేష్,రెడ్డమ్మ ,సాయి,శ్రీనివాస్,నవీన్, రాజు,శ్రీను నాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశానికి వెన్నెముక!!

● మత్తుకు దూరం - దేశాభివృద్ధికి దగ్గర ● వివేకానంద బాటలో యువత నడవాలి ● సక్రమ మార్గంలో, క్రమశిక్షణతో వ్యవహరించాలి ● రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి






**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 12 (వార్తాప్రభ ప్రతినిధి)**యువతే దేశానికి వెన్నెముక అని రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం భారత యువతకు స్ఫూర్తిదాత, యుగపురుషుడు స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను రామగుండంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ కాలనీ నుండి మేడిపల్లి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, వివేకానందుని నినాదాలతో పరిసర ప్రాంతాలను మార్మోగించారు. ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుల సంధ్యారాణి మీడియాతో మాట్లాడాతూ యువతకు పలు కీలక సూచనలు చేశారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడుచేసుకోకుండా, వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శ మార్గంలో నడవాలని అన్నారు. స్వామి వివేకానంద ఆలోచనలు నేటి తరం యువతకు దిక్సూచి వంటివి. సమాజంలో సానుకూల మార్పు రావాలంటే యువత క్రమశిక్షణతో, సక్రమ మార్గంలో పయనించాలి అని తెలిపారు.ఈ వేడుకల్లో హిందూ వాహిని రాష్ట్ర అధ్యక్షులు కాంతాల సంతోష్, మంతిని శివ, జిల్లా ఉపాధ్యక్షులు గోలివాడ శ్రీకాంత్, అలాగే బిజెపి నాయకులు సోమారపు అరుణ్ - లావణ్య దంపతులు, మిట్టపల్లి సతీష్ కుమార్, సిలివేరి అంజి, ఈదునూరి చిరంజీవి, లంక వినోద్, ఈదునూరి శ్రీకాంత్ పలువురు కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## యువత వివేకానందుని అడుగుజాడల్లో నడవాలి

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్ ,జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బర్కత్‌పుర నగర బిజెపి కార్యాలయంలో ఏర్పటు చేసిన కార్యక్రమనికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విచ్చేసి స్వామి వివేకానంద ఫోటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద అడుగు జడలలో నడవవలని, వారి అశయాలను నేరవేర్చాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ గౌతమ్ రావు ,మాజీ మంత్రి సి కృష్ణ యాదవ్ ,రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్,నాయకులు ఎక్కల నందు,శ్యామ్ రాజ్, ఎక్కల కన్నా,సూర్య ప్రకాష్ సింగ్,చిటి శ్రీదర్,వనం రమేష్,సి వినోద్ యాదవ్,రవీందర్ ఆనంద్ దాస్, పి.గోవర్ధన్ రెడ్డి,పుట్ట పాండు రంగయ్య తదితరులు పాల్గొనట్లు బిజెపి ఓబీసీ సెల్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్ ఒక ప్రకటన లో తెలిపారు.

## అగర్వాల్ సమాజ్ "అభిభావకుల మిలన్ సదస్సు"




**హైదరాబాద్ : జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అగర్వాల్ సమాజ్ తెలంగాణ ఆధ్వర్యంలో నడుస్తున్న తెలంగాణ మ్యారేజ్ డేటా కమిటీ సమాజంలో ఉన్న వివాహయోగ్య యువకులు, యువతుల బయోడేటాలను సేకరించాలనే ఉద్దేశంతో అభిభావకుల మిలన్ సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది అభిభావకులు పాల్గొన్నారు. దాదాపు 100 కొత్త బయోడేటాలు కమిటీకి అందాయి. అలాగే పాత బయోడేటాలను కూడా తాజాకరించారు. ఈ సందర్భంగా అగర్వాల్ సమాజ్ తెలంగాణ మాజీ అధ్యక్షులు మణీష్ అగర్వాల్,అధ్యక్షులు అనిరుధ్ గుప్తా,ఉపాధ్యక్షులు రూపేశ్ అగర్వాల్, మానద మంత్రి వికాస్ కేశాన్, అచల్ గుప్తా లను సత్కరించారు.మాజీ అధ్యక్షులు మణీష్ అగర్వాల్ మాట్లాడుతూ సమాజంలో మ్యారేజ్ డేటా కమిటీ, బయోడేటాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ వివాహయోగ్య పిల్లల బయోడేటాలను సమాజంతో పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ కమిటీకి అభినందనలు తెలిపారు.వచ్చే సారి మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అధ్యక్షులు అనిరుధ్ గుప్తా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజంతో అనుసంధానమై ఉండాలని చెప్పారు. అగర్వాల్ సమాజం తెలంగాణలో ఇదే ఏకైక మ్యారేజ్ డేటా కమిటీ అని తెలియజేశారు. తాను కూడా తన కుటుంబ బయోడేటాను సమర్పిస్తూ, అందరూ సమాజంలోనే వివాహ సంబంధాల కోసం బయోడేటాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.మంత్రి వికాస్ కేశాన్ సమాజంలో పెళ్లి సంబంధాల విషయంలో ఎదురవుతున్న కష్టాలపై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని కమిటీని కోరారు. మ్యారేజ్ డేటా కమిటీ చైర్మన్ అజయ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా అగర్వాల్ సమాజం తెలంగాణలో ఇలాంటి కార్యక్రమం తొలిసారి నిర్వహించబడుతుందని తెలిపారు. అభిభావకులు బయోడేటాలు ఇవ్వడమే కాకుండా వాటిలో సరైన సమాచారం ఇవ్వాలని, వివాహం పూర్తయ్యాక సమాజానికి తెలియజేయాలని కోరారు. సమాజంలో వివాహ సంబంధాల కష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు.కమిటీ కన్వీనర్ సతీష్ అగర్వాల్, వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ స్నేహి, సునీల్ మిత్తల్, గోవింద్ రామ్ అగర్వాల్, అశోక్ జిందల్ లతో కలిసి ప్రతి అభిభావకుడితో వ్యక్తిగతంగా మాట్లాడి బయోడేటాలను సేకరించారు.పాత బయోడేటాలను కూడా నవీకరించారు. కమిటీ అన్ని కేంద్ర పదాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ కార్యాలయ సిబ్బంది పవన్ డోకానియా, శీతల్ అగర్వాల్, శివ కుమార్, రాజు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయాన్ని దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను కాలకాలానికి నిర్వహించాలనే నిర్ణయం కమిటీ తీసుకుంది. తద్వారా సమాజంలోని వారికి వివాహ సంబంధాలు ఏర్పడటంలో మరింత సహాయం అందుతుంది.

## యువశక్తికి స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ జనవరి 12 (వార్తా ప్రభ ప్రతినిధి)** యువశక్తికి స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం స్వామి వివేకానంద 163 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడా సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా యువజన క్రీడా సేవల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ లతో కలిసి హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నుముక

● రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా వెల్లడి ● పశ్చిమ నియోజకవర్గంలో ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు
● ప్రశంసా ప్రతాలు అందజసిన రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఆర్యవైశ్య అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్
● సీఎం చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్ కు కృతజ్ఞతలు తెలిపిన ఉత్తమ కార్యకర్తలు





**విజయవాడ పశ్చిమ జనవరి 12 :**(వార్తా ప్రభ ప్రతినిధి) తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత.. ఇదే తెలుగుదేశం పార్టీ మూల సూత్రం. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నుంచి సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ తొలి ప్రాధాన్యం కార్యకర్తలకే ఇస్తున్నారని రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వంద కు వంద శాతం కేటాయించిన పనులు పూర్తి చేసిన 200 మంది టిడిపి కార్యకర్తలను ఉత్తమ కార్యకర్తలుగా తెలుగు దేశం ప్రకటించింది. చిట్టినగర్ దగ్గర గల నగరాల కళ్యాణమండపంలో పశ్చిమ నియోజకవర్గంలో ఉత్తమ కార్యకర్తలుగా ప్రకటించిన వారికి ప్రశంసా పత్రాల బహుకరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఆర్యవైశ్య సంక్షేమ , అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కోట్లాది మంది కార్యకర్తలే బలం, బలగం అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ కి లేనంతగా కార్యకర్తల శక్తి తెలుగుదేశం పార్టీకి వుందన్నారు. ఉత్తమ కార్యకర్తలతో పాటు ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ కోసం పనిచేయటానికి సిద్దంగా వుంటారని స్పష్టం చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో కార్యకర్తల బలం, బలగం తోనే టిడిపి ముందుకు నడుస్తోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి గా వుండటం రాష్ట్ర ప్రజల వరమంటూ....రా(ష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు వెల్లువలా పెట్టుబడులు తీసుకురావటం, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయటం, ఎప్పటికప్పుడు రాబోయే తరాలకు మార్గదర్శకం చేయటం ఆయన విజన్ కి నిదర్శనమంటూ కొనియాడారు. ప్రజలందరూ సీఎం చంద్రబాబు పాలన వుండటం అదృష్టంగా భావించాలన్నారు. రాబోయే కాలంలో ఇంత కంటే భారీ మెజార్టీ తో టిడిపి గెలవబోతుందంటూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. . కార్యకర్తలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోనే ఉత్తమ కార్యకర్తల అవార్డ్ తెలుగేదశం పార్టీ ప్రకటించిందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో టిడిపి బలంగా వుందని, కార్యకర్తల బలంతో మరింతగా ముందుకు వెళతామన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంక్షేమ , అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ కార్యకర్త స్థాయి నుంచి నాయకత్వ స్థాయికి తీసుకువచ్చిన తెలుగుదేశంపార్టీకి రుణపడి వుంటానన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ లో ఉన్నత గౌరవం, విలువ, నాయకత్వం లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణరావు, ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి పేరాబత్తుల రమణ; ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు, నగరాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు సుఖాసి కిరణ్, బేవర సాయి కిరణ్, శాప్ డైరెక్టర్ సంతోష్, గొల్లపూడి వ్యవసాయ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు నసీమా, పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు సుభాషిణి, పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అన్సార్, పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తమ్మిన శేఖర్, క్లస్టర్ల ఇన్చార్జులు సుబ్బారెడ్డి, యేదుపాటి రామయ్య, ప్రభుదాసు, దనేకుల సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు లతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆవుల రాంబాబు పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా సన్మానించిన శాసనసభ్యులు



**పెనుగంచిప్రోలు, జనవరి 12( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు ఆర్కే ఫంక్షన్ హాల్ నందు నందిగామ పట్టణానికి చెందిన ఆవుల రాంబాబు పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ, గత 27 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పదవీ విరమణ సన్మాన సభ కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొని, ఆవుల రాంబాబు ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు గా 27 సంవత్సరాలు నుండి రాంబాబు ఎంతో మంది విద్యా ర్థులనుతీర్చి దీదారని అలాగే వీరు పనిచేసిన పాఠశాలలోని తోటి ఉపాధ్యాయులతో ఆ గ్రామాల పెద్దలతో కలిమిడి గా కలిసి పోయే స్వభావం గల వ్యక్తి ఆవుల రాంబాబు అనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ అధికార ప్రతినిధి నల్లమోలు వర ప్రసాద్,ఎంపిపి మార్క పూడి గాంధీ, జెడ్ పిటిసి ఊట్ల. నాగమణి,మాజీ జెడ్పిటిసి లు గజ్జి కృష్ణ మూర్తి,కాకాని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు,మాజీ ఎంపిపి గుడపాటి శ్రీనివాసరావు,మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుంటుపల్లి వాసు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సామినేని



**పెనుగంచిప్రోలు, జనవరి 12( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం, అనిగండ్లపాడు గ్రామంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ప్రారంభించారు. అనంతరం జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ బాడిత శంకర్ తో కలిసి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకరరావు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ తునికిపాటి శివ , జగ్గయ్యపేట నియోజకవర్గం జనసేన నాయకులు లగడపాటి శంకర్,పెనుగంచిప్రోలు నీటి సంఘం ఛైర్మన్ యలమందల నరసింహారావు , ఉమ్మడిజిల్లా పార్టీ సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్ కుమార్ , పార్టీ ఐటీ వింగ్ పాల హరికృష్ణ , పెనుగంచిప్రోలు మాజీ సొసైటీ అధ్యక్షులు గుంజుపల్లి నర్సయ్య , కాకాని పద్మ , అనిగండ్లపాడు గ్రామ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండారెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**చేజర్ల జనవరి 12 (వార్తాప్రభ)** చేజర్ల మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బోయిళ్ల మాలకొండా రెడ్డి అద్వర్యంలో 13వ తేదీ మంగళవారం రోజు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పుట్టినరోజు సందర్బంగా గుర్తు చేజర్ల మండలంలోని బోడిపాడు లోని కొండారెడ్డి నివాసం వద్ద ఉదయం 9 గంటలకు మెగా రక్తదాన సిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే 10 గంటలకు విక్రమ్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని బారీ కేకు కటింగ్ జరుగునని వారు తెలిపారు. వైఎస్ఆర్సిపి మండల అనుబంధం విభాగం అధ్యక్షులు సభ్యులు నూతన పార్టీ కమిటీ సభ్యులు మరియు మేకపాటి అబిమానులు పార్టీ అభిమానులు నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## ఏలూరు కలెక్టరేట్ ముందు కోకో రైతుల ధర్నా.

● కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలి.. ● కోకో గింజలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైస్ పాలసీ ప్రకటించాలి.. ● రాష్ట్ర కోకో బోర్డు, కేంద్ర కోకో పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి




**ఏలూరు జనవరి 12 :**(వార్తా ప్రభ ప్రతినిధి) కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని, ప్రైస్ పాలసీ ప్రకటించాలని, రాష్ట్ర కోకో బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర కోకో పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ ముందు కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులు సామూహిక రాయబార కార్యక్రమం చేపట్టి కలెక్టరేట్ లో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ధర్నా సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్వతనేని సుబ్రహ్మణ్యేశ్వర రావు, పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి మాట్లాడారు. కోకో గింజలు కొనుగోలు సీజన్ ప్రారంభమైందని, రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధర కంపెనీలు ఇవ్వడం లేదని చెప్పారు. కోకో గింజలకు ప్రైస్ పాలసీ లేకపోవడం వలన కంపెనీల ఇష్టా రాజ్యంగా ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలు రైతులకు వచ్చేలా ఫార్ములా రూపొందించి ధర ప్రకటిస్తామని గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత సీజన్ కు అమలు చేయాల్సిఉందన్నారు. ఇంతవరకు ఫార్ములా ప్రకటించకపోవడం వలన కంపెనీలు పాత పద్ధతుల్లోనే సిండికేట్ గా మారి కోకో రైతులను మోసగించే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.550లకు పైగా ధర ఉంటే ప్రస్తుతం కంపెనీలు రూ.400లకు కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. ప్రపంచంలో అత్యధికంగా కోకో గింజలు ఉత్పత్తి చేసే ఘనా, ఐవరీ కోస్ట్ వంటి ఆఫ్రికా దేశాలలో ప్రస్తుతం కోకో పంటకు అన్ సీజన్ అని ఆధారలనే అంతర్జాతీయ మార్కెట్లో చూపిస్తున్నారని, వారికి సీజన్ కాలంలో వచ్చిన రేట్లను ఇక్కడ అమలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో గింజలకు ప్రైస్ పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజలపైన, కోకో ఉత్పత్తుల పైన దిగుమతి సుంకాలు తక్కువగా ఉండటం వలన ఇబ్బడిముబ్బడిగా విదేశీ దిగుమతులు వలన దేశీయంగా రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విదేశీ కోకో గింజలు, కోకో ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు పెంచాలని కోరారు. రాష్ట్ర కోకోబోర్డును, కేంద్ర కోకో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వాలు స్పందించకపోతే కోకో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు పానుగంటి సుధాకర్,పి.నరేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

## ఇసుకను ప్రజలకు అందే విధంగా ప్రణాళిక.- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం జనవరి 12 :**(వార్తా ప్రభ ప్రతినిధి)జిల్లాలో మరో కొత్త రీచ్ లను గుర్తించి 24 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుకను ప్రజలకు అందుబాటులోనికి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం 5 ఇసుక రీచ్ లకు గాను నార్త్ వల్లూరు, రొయ్యూరు, చోడవరం, పడమటలంక 4 ఇసుక రీచ్ లలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రజలు తీసుకునీ వెళ్లడానికి అందుబాటులో ఉన్నదన్నారు. ఐదవ ఇసుక రీచ్ అయిన పాప వినాశనంలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నప్పటికీ అది ప్రస్తుతం టెండర్ల దశలో ఉందన్నారు. కొత్తగా ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి వచ్చే సంవత్సరం మార్చి నెల వరకు సెమీ మెకనైజ్డ్ కొత్త ఇసుక రీచ్ లను గుర్తించాలని, రాబోయే అవసరాలను దృష్టిలో ఉంచుకొని 24 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తేవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు గట్టి నిఘా ఉంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా సొంత అవసరాలకు ఇసుకను త్రవ్వకుండా నిరోధించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వివి నాయుడు, గనులు భూగర్భ శాఖ ఏడి శ్రీనివాస్ కుమార్, మచిలీపట్నం ఇన్చార్జి ఆర్డీవో పోతురాజు, భూగర్భ జల శాఖ ఇన్చార్జి ఏడి చిరంజీవి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాసరావు, గనుల శాఖ ఏ.జి.కొండారెడ్డి, ఆన్లైన్లో గుడివాడ, ఉయ్యూరు ఆర్డిఓ లు బాలసుబ్రమణ్యం, షారోన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వివేకానందుడి మార్గం యువతకు దిక్సూచి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

### రంగారెడ్డి నగర్ డివిజన్‌లో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు
### రక్తదాతలను అభినందించిన ఎమ్మెల్యే




**కుత్బుల్లాపూర్/రంగారెడ్డి నగర్, జనవరి 12, (వార్తాప్రభ) :**యువత తలుచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని, దేశ గమనాన్ని మార్చగల శక్తి యువతకే ఉందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం 127 – రంగారెడ్డి నగర్ డివిజన్, గాంధీ నగర్‌లో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద 163వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**రక్తదాన శిబిరం – సేవో నిరతి:** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (జీడిమెట్ల) మరియు ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్త సహకారంతో నిర్వహించిన 20వ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించి, వారికి సర్టిఫికెట్లు మరియు మెమంటోలను అందజేశారు. ముందుగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వామి వివేకానంద గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన చూపిన ఆత్మస్థైర్యం, ధైర్యం నేటి తరం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశ ఐక్యత, సమగ్రత కోసం కృషి చేస్తూ వివేకానందుడి ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఎర్ర శంకరయ్య, స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు జల్దా లక్ష్మీనాథ్ మరియు అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, తిమ్మయ్య, నవీన్, రాజిరెడ్డి, ఎల్లయ్య, సందీప్, ఆనంద్, రాజు, విజయ్, ఆంజనేయులు, కార్తీక్ గౌడ్, బాలు నేత, సతీష్ గట్టోజి, వరప్రసాద్, అల్లావుద్దీన్, సోను తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వహించడం "లయన్స్ క్లబ్" ప్రధాన ధ్యేయం
### డిస్టిక్ అంబాసిడర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు.



**.కంచికచర్ల, జనవరి 12 :**(వార్తా ప్రభ ప్రతినిధి) సమాజంలో ఉచిత సేవలు అందించడంలో కంచికచర్ల లైన్స్ క్లబ్ ముందుంటుందని లయన్ డిస్టిక్ అంబాసిడర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు పేర్కొన్నారు. లయన్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకులు లయన్స్ మెల్విన్ జోన్స్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా గవర్నర్ వి వి సి ఆంజనేయులు ఆదేశాల మేరకు లయన్స్ హంగర్ విక్ లో భాగంగా కంచికచర్ల నెహ్రూ సెంటర్ నందు 100 మంది పేద ప్రజలకు మంగళవారం బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా లయన్స్ డిస్టిక్ అంబాసిడర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో కంచికచర్ల లయన్స్ క్లబ్బు ద్వారా బడుగు బలహీన వర్గాల పేద ప్రజానీకానికి ప్రధానంగా విద్య, వైద్య, ఉచిత సేవా కార్యక్రమాలు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు కాపు సంఘ నాయకులు వేమా వెంకట్రావు, లయన్ క్లబ్ అధ్యక్షులు ఎం ఎస్ ఆర్ వి ప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు నంబూరు పెదబాబు, పెద్దినీడి కోటేశ్వరరావు, తాడే కోరు వెంకటప్పయ్య, కాపు సంఘ నాయకులు నంబూరి నాగేశ్వరరావు, దాసరి రాము, గంజి దుర్గారావు, పొన్నపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యార్లగడ్డ సొంత నిధులతో పశు పోషకులకు కన్సోలేషన్ బహుమతులు




**గన్నవరం : జనవరి 12 :**(వార్తా ప్రభ ప్రతినిధి)పశు పోషణ పట్ల మక్కువ కలిగిన ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పశువుల పట్ల తనకున్న ఆప్యాయతను, పశు పోషకుల పట్ల అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆదివారం జరిగిన గోవులు, దూడల అందాల పోటీల్లో విజేతలకు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ పశుపోషకులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కడప, కర్నూలు వంటి దూర ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి ఇక్కడికి వచ్చి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించలేని వారిని ఉత్తి చేతులతో పంపించి నిరుత్సాహపరచటం తగదని వారికి ప్రోత్సాహకంగా బహుమతులు ఇవ్వటం సబబుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈమేరకు కడప, కర్నూల్ నుండి వచ్చిన రైతులకు రూ.10 వేలు నగదును బహుమతి గా తాను ఇస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ సభ ముఖంగా ప్రకటించారు. తన కార్యాలయం నుండి నగదు తీసుకుని పశుపోషకులకు ఫోన్ పే ద్వారా బదిలీ చేయాలని పోటీల నిర్వాహకులు కాసర్నేని రాజా, వెంకటనారాయణలను ఆదేశించారు. పశు పోషకులను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే వెంకటరావును ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## అయ్యా వి ఎమ్ సీ అధికారులూ..53 వ,డివిజనుల్లో సమస్యలు ఇవీ పరిష్కరించరూ......
### బిజేపీ నాయకులు పోతిన అవినాష్





**విజయవాడ పశ్చిమ జనవరి 12 :**(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో కొత్తపేట 53వ డివిజన్ లో పలు సమస్యలు పరిష్కరించడం కొరకు బిజెపి యువనాయకులు పోతిన అవినాష్, డిఈ రమేష్ తో కలిసి పరిశీలించారు. హనుమంతరాయ చేపల మార్కెట్లో కాలువలపై సిమెంట్ చప్టాలు , కామన్ ఏరియాలో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన తరుణంలో లైట్ల మరియు సిసి కెమెరాల ఏర్పాటు, వాటర్ ట్యాంక్ క్లినింగ్, డ్రయిన్ వ్యవస్థ శుభ్రపరుచుట ఇంకా అనేక సమస్యలు మరియు మార్కెట్ కు ప్రక్కనే ఉన్న ప్రజా మూత్రశాల, చెత్తడబ్బాలు రోడ్డు ఆక్రమణకు గురవ్వడం అంశాలపై బీజేపీ నాయకులు పోతిన హావినాష్ అధికారులకు స్వయంగా చూపించారు. అంతే కాకుండా తమ్మిన గురవమ్మ సత్రం ప్రక్కన ప్రజా మూత్రశాల, చెత్తడబ్బాలు రోడ్డు ఆక్రమణకు గురికావడం, దూదిఫ్యాక్టరీ సందులో డ్రైనేజీ వ్యవస్థ, వర్షాకాలంలో గణపతిరావు రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నటువంటి గణపతిరావు రోడ్డుకు అనుసంధానంగా ఉన్నటువంటి సైకం వారి వీధి, అమ్మ హాస్పిటల్ వీధి, మసిద్ సందు, డ్రయిన్ వీధుల్లో రోడ్డు చివర్లలో కాలువలకు ఇరువైపులా రైలింగ్ ఏర్పాటు చేయుట, అనేక చోట్ల నేల బోర్లు మరమ్మత్తులు, బురాడ వారి వీధిలో సమస్యలు ఇంకా అనేక సమస్యలు పరిష్కారించాలని పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సుజనాచౌదరి దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన ఆదేశాలతో డిఈ రమేష్ పరిశీలనకు వచ్చి ఈ సమస్యలకు అతి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారని పోతిన అవినాష్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గాన్ని సమస్యలు లేని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను అని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ముందుకు తీసుకువెళ్తున్న శాసనసభ్యులు సుజనాచౌదరి దృష్టికి ఎటువంటి సమస్యలు తీసుకువెళ్లిన తక్షణం అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్య పరిష్కారానికి దోహదపడుతున్నారని అవినాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పోతిన అచ్యుతరావు, జనసేన నాయకులు రేఖపల్లి శ్రీనివాసరావు, గరే భాస్కరరావు, ఏఈ మార్క్, శానటరీ ఇన్స్పెక్టర్ గోపయ్య, వాటర్ లైన్ మెన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్ లోడ్ తో ఆటోలను నడప వద్దు

**యంవిఐ యంవియన్ నారాయణ రాజు**



**పెనుగంచిప్రోలు, జనవరి 12(వార్త ప్రభ)** జగ్గయ్యపేట రవాణా శాఖ ఆధ్వర్యంలో 37 వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు పెనుగంచిప్రోలు కేంద్రం గా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ యంవియన్ నారాయణ రాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు.వాహనాలకి సంబంధించిన కాగితాలన్ని ఫోర్స్ లో ఉండేలా చూసుకోవాలని, డ్రైవింగ్ చేసే వారికి తప్పని సరిగ లైసెన్స్ ఉండాలన్నారు.మైనర్లకి వాహనాలను ఇవ్వదని,మైనర్లు వాహనాలను స్పీడ్ గా నడిపేటప్పుడు ప్రమాదాలు జరిగితే, వారికి వాహనం ఇచ్చిన వారే శిక్షార్హులన్నారు.ఆటో నడిపే వారు తప్పని సరిగా కాకి చొక్కాను వేసుకొని అన్ని కాగితాలను,ఫోర్స్ లోఫిట్నెస్ఉంచుకోవాలన్నారు.కార్లు నడిపే వారు తప్పని సరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు.ప్రమాదాలు నివారించడానికి తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించి,సేఫ్టీగా ఇంటికి చేరుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మోటర్ వెహికల్ కార్యాలయ సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు

## 60 డివిజన్ల తుది ఓటర్ల జాబితా విడుదల

**మున్సిపల్ కమిషనర్ సుజాత**



**భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం, కొత్తగూడెంలో తెలంగాణ మున్సిపాలిటిల చట్టం 2019లోని సెక్షన్ 11 , 12 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారి చేసిన ఆదేశాలకు అనుగుణంగా, నగరపాలక సంస్థ, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని 60 డివిజన్ లకు సంభందించిన తుది ఓటర్ల జాబితా (డివిజన్ వారిగా) ను12 జనవరి 2026నాడు ప్రచురించడం జరిగినదని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.ఈ తుది ఓటర్ల జాబితా నగరపాలక సంస్థ కొత్తగూడెం కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం,రెవిన్యూ డివిజినల్ కార్యాలయం మరియు అదనపు కలెక్టర్ (ఎల్బిఎస్ ) కార్యాలయములో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 60 డివిజన్ సంభందించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య ఈ విధంగా ఉంది: మహిళలు 70,314 పురుషులు64,431 ఇతరులు 30 మొత్తం ఓటర్లు 1,34,775 మంది ఉన్నారని తెలిపారు

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**కూకట్ పల్లి, జనవరి 12(వార్తాప్రభ):**వివేకానంద నగర్ కాలనీ మెయిన్ రోడ్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ హాజరై స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ,యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకుని మంచి మార్గంలో నడవాలని సూచించారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగితే భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటినట్లవుతుందని తెలిపారు. యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ సీనియర్ నాయకులు చంద్రకాంతరావు,సంజీవరెడ్డి, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి,జి. ప్రసాద్, మల్లయ్య, విద్యా, కల్పన, ఏకాంత్ గౌడ్, శ్రీధర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి జాతరకు రావాలని పీసరి కృష్ణారెడ్డికి ఆహ్వానం

**ఘనంగా ఏర్పాట్లు చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు**

**జనవరి 20న బౌరంపేట్ రిజర్వు ఫారెస్ట్‌లో జాతర మహోత్సవం**



**దుండిగల్/బౌరంపేట్, జనవరి 12, (వార్తాప్రభ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బౌరంపేట్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలో వెలసిన ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవానికి రావాల్సిందిగా బీజేపీ రాష్ట్ర నాయకులు పీసరి కృష్ణారెడ్డి కి మరియు వారి బృందానికి ఆహ్వానం అందింది. ఈ నెల 20వ తేదీన (జనవరి 20) నిర్వహించనున్న ఈ జాతర ఏర్పాట్లలో భాగంగా, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సోమవారం కృష్ణారెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

**భక్తిశ్రద్ధలతో జాతర నిర్వహణ:**ప్రతి ఏటా ఎంతో వైభవంగా జరిగే ఈ ఎల్లమ్మ తల్లి జాతరకు స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది కూడా జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. పీసరి కృష్ణారెడ్డి తో పాటు బీజేపీ బృందాన్ని ఆహ్వానించిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఉన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి జాతరలో పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని వారు కోరారు.

# సేవే పరమార్థం!!

- అమ్మ ఆలోచన.. నా ఆచరణ
- రాజకీయం, సేవ నాకు రెండు కళ్లు
- మనం సంపాదించిన సంపద పదిమందికి ఉపయోగపడాలి
- వైద్య విద్యార్థికి చేయూత వీహెచ్ఆర్ బాధ్యత
- టీం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు
- వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ వ్యాళ్ల హరీష్ రెడ్డి





**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 12 (వార్తాప్రభ ప్రతినిధి)**సేవే పరమార్థం అని వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ వ్యాళ్ల హరీష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం రామగుండం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ వ్యాళ్ల హరీష్ రెడ్డికి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సన్మాన గ్రహీత హరీష్ రెడ్డి మాట్లాడుతూ...... అమ్మ ఆలోచన.. నా ఆచరణకు రూపమే వీహెచ్ఆర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అని తెలిపారు. రాజకీయం, సేవ నాకు రెండు కళ్లు అని భవిష్యత్తులో ఈ ప్రస్థానం నిరాటంకంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. నిరుపేద వైద్య విద్యార్థి మేకల డార్విన్ చదువుకు అండగా నిలవడం తమ ఫౌండేషన్ బాధ్యత అని అన్నారు. మనం సంపాదించిన సంపద పదిమందికి ఉపయోగపడాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాము, అయిత శివ, రమణారెడ్డి, జాహిద్ పాషా, అనుముల కళావతి, పోలాడి శ్రీనివాసరావు, శ్యామ్, తిరుమల్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీలో స్ఫూర్తిదాయకంగా జెమ్!!

- బాలికా సాధికారతకు సరికొత్త బాటలు
- సామాజిక బాధ్యతలో ఎన్టీపీసీ మార్క్
- 'జెమ్మ' శిబిరంతో గ్రామీణ బాలికల్లో నూతన ఉత్తేజం
- ఆకాశమే హద్దుగా గర్ల్స్ ఎదగాలి
- ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత









**పెద్దపల్లి/ ఎన్టీపీసీ: జనవరి 12 (వార్తాప్రభ ప్రతినిధి)**కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిర్వహణలో ఎన్టీపీసీ ఎప్పుడూ ముందుంటుందని, బాలికల భవిష్యత్తును తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ (జెమ్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చందన్ కుమార్ సమంత అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఈ శీతాకాల శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈడి చందన్ కుమార్ సమంతతో పాటు దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్య అతిథులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. బాలికలకు కేవలం చదువే కాకుండా ఆరోగ్యం, పరిశుభ్రత, ఆత్మరక్షణ మరియు సృజనాత్మకతపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆకాశమే హద్దుగా బాలికలు ఎదగాలి అని కోరారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జానపద, శాస్త్రీయ నృత్యాలతో బాలికలు తమలోని ప్రతిభను చాటారు. నెల రోజుల శిక్షణలో తాము నేర్చుకున్న అంశాలను ప్రదర్శనల రూపంలో వివరించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, దీప్తి మహిళా సమితి సభ్యులు, విద్యార్థినుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మ ప్రేమ అనంతం.. సమాజ సేవ అద్భుతం!!

**ఆకలి తీర్చడమే పరమావధి**

**మూడేళ్ల ప్రస్థానం - నిరంతర సేవ**

**ఘనంగా తులసి ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం**

**ఫౌండేషన్ అధ్యక్షురాలు జంజర్ల లావణ్య**



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 12 (వార్తాప్రభ ప్రతినిధి)**అమ్మ ప్రేమ అనంతం.. సమాజ సేవ అద్భుతం అని తులసి ఫౌండేషన్ అధ్యక్షులు జంజర్ల లావణ్య ప్రశంసించారు. "అమ్మ ప్రేమ అనంతం.. ఆ ప్రేమను సమాజ సేవ రూపంలో పంచడమే అసలైన బాధ్యత" అనే నినాదంతో ముందుకు సాగుతున్న తులసి ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. 5వ ఇంక్లైన్ వాసి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆధ్వర్యంలో ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా స్థానిక నిరుపేదలకు, అన్నార్థులకు కడుపునిండా భోజనం వడ్డించారు. రోడ్లపై నివసించే యాచకులకు భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....... సమాజంలో నిరుపేదల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని, మనకు ఉన్నదానిలో కొంత భాగాన్ని ఇతరులకు పంచడం వల్ల కలిగే తృప్తి వెలకట్టలేనిదని తెలిపారు. నిరుపేదల పట్ల జంజర్ల లావణ్య చూపిస్తున్న ఈ ఉదారతను, వారి సేవా గుణాన్ని స్థానికులు, లబ్ధిదారులు కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో జరగాలని వారు ఆకాంక్షించారు.

## చిన్నారులకు సంక్రాంతి కానుక: ఉచితంగా గాలిపటాల పంపిణీ

- కైట్ ఫెస్టివల్‌లో భాగంగా మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు చొరవ
- ఆనందోత్సాహాల మధ్య గాలిపటాలు అందుకున్న పిల్లలు





**కుత్బుల్లాపూర్/బాచుపల్లి, జనవరి 12, (వార్తాప్రభ) :**సంక్రాంతి పండుగ సమీపిస్తున్న వేళ, నియోజకవర్గంలోని చిన్నారులకు పండుగ ఉత్సాహాన్ని పంచేందుకు మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. కైట్ ఫెస్టివల్‌లో భాగంగా స్థానిక పిల్లలకు ఆమె ఉచితంగా గాలిపటాలను అందజేశారు.

**పండుగ సంస్కృతిని కాపాడుదాం:**ఈ సందర్భంగా విజయలక్ష్మి సుబ్బారావు మాట్లాడుతూ.. సంక్రాంతి అంటేనే గాలిపటాల పండుగ అని, మన సంప్రదాయాలను, పండుగలను పిల్లలకు పరిచయం చేస్తూ వారిలో ఆనందాన్ని నింపడం సంతోషంగా ఉందన్నారు. రంగురంగుల గాలిపటాలను అందుకున్న చిన్నారులు ఎంతో ఉత్సాహంగా కనిపించారు. తమకు ఇష్టమైన గాలిపటాలను ఉచితంగా అందించినందుకు విజయలక్ష్మి సుబ్బారావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

# అన్నదానం మహాభాగ్యం

**కంటెస్టెడ్ కార్పొరేటర్ రంగారావు**




**కూకట్ పల్లి,జనవరి 12(వార్తాప్రభ):**అన్నదానం మహాభాగ్యమని ఆల్విన్ కాలనీ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బల్లూరి రంగారావు తెలిపారు. అమెరికాలోని తన మనవడి ( అజయ్ ప్రావీన రావుల తనయుడు) అర్విక్ రావు మొదటి పుట్టినరోజు పురస్కరించుకొని ద్వారకమై సేవా సమితి అనాథాశ్రమంలో నివసిస్తున్న పలువురికి అన్నదానంతో పాటుగా పండ్లు, బిస్కెట్లను అందజేశారు. పేదలకు చేతనైన సాయం అందించడం సంతృప్తి అందిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్వరూప రంగారావు, ప్రదీప్ రెడ్డి, సమతా రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గోపికా గీతం (తిరుప్పావై)

**ధనుర్మాస స్నాన, వ్రత సంకీర్తనం**

**ఇరవై ఏడవ పాశురం:**



కూడారై వెల్లుం శీర్ గోవిందా,
ఉన్ తన్నై పాడి పఱై కొండు యాం పెఱు శమ్మానం,
నాడు పుగళుం పరిశినాల్ నన్ఱాగ,
శూడగమే తోళ్ వళైయే తోడే శెవిప్పూవే,
పాడగమే ఎన్ఱనైయ పల్?గలనుం యామణివోం,
ఆడై యుడుప్పోం అదన్ పిన్నే పాఱ్సోఱు,
మూడ నెయ్ పెయ్దు ముళంగై వళివార,
కూడియిరుందు కుళిరందేలోరెంబావాయ్ ?

**భావ వివరణ:** ఓ యాదవ ధనపాల! (యాదవుల పెన్నిధి అయినవాడా!)నిన్ను ద్వేషించే శత్రువులను కూడా, కేవలం నీ కల్యాణ గుణములతో జయించి, నీకు దాసులుగా చేసుకునే ఓ గోవిందా!మేము నిన్ను నోరారా కీర్తించి, మా వ్రతానికి ఫలితమైన 'పఱై' అనే పురుషార్థాన్ని పొందుతాము. ఈ లోకమంతా వేనోళ్ళ పొగిడేలా, మా యాదవ వంశ కీర్తి ఇనుమడించేలా నీవు మాకు గొప్ప సన్మానాన్ని ప్రసాదించాలి.నీవు మాకు ఇచ్చే ఆ బహుమానాలు ఎలా ఉండాలంటే... చేతికి కంకణాలు (చూడగం), భుజకీర్తులు (తోళ్ వళై), చెవి కమ్మలు (తోడు), కర్ణపుష్పాలు (శెప్పూ), పాదాలకు అందెలు (పాడగం) మొదలైన సర్వాభరణాలను మేము సంతోషంగా ధరించాలి. ఆపై నూతన పట్టు వస్త్రాలను కట్టుకోవాలి.ఇవన్నీ అలంకరించుకున్న తరువాత, పాలల్లో ఉడికించిన అన్నం (క్షీరాన్నం) కనిపించనంతగా నిండా ఆవు నెయ్యిని పోసి, మేము ఆరగిస్తూ ఉంటే... ఆ నెయ్యి మా మోచేతుల గుండా కారుతుండగా... మేమందరం నీతో కలిసి ఒకే పంక్తిలో కూర్చుని, ఆనందంగా భుజించి, మా విరహ తాపమంతా తీరేలా చల్లబడాలి (పరవశించాలి).

**పరమార్థం (సందేశం):**ఈ పాశురం భగవంతునితో కలిసినప్పుడు భక్తుడు పొందే 'సంపూర్ణ అనుభవాన్ని' (భోగ్యతను) తెలియజేస్తుంది.కూడారై వెల్లుమ్ (శత్రు జయం): భగవంతుడు తనను ఎదిరించేవారిని బాణాలతో కాకుండా, తన గుణాలతో జయిస్తాడు. ఇక్కడ అహంకారం అనే శత్రువును జయించడం అని అర్థం.అలంకారం – ఆత్మగుణములు: గోపికలు కోరిన ఆభరణాలు బాహ్య సౌందర్యానికి మాత్రమే కాదు, అవి ఆత్మకు ఉండవలసిన జ్ఞానం, భక్తి, వైరాగ్యం అనే ఆభరణాలకు సంకేతాలు.కూడి ఇరున్దు (సహపంక్తి భోజనం): భగవంతునితో కలిసి ఉండటమే (సంశ్లేషమే) నిజమైన మోక్షం. ఆవు నెయ్యి జ్ఞానానికి ప్రతీక అయితే, క్షీరాన్నం భగవత్ అనుభవానికి ప్రతీక. ఆ అనుభవంలో మునిగి తేలడమే పరమార్థం.భక్తుల విన్నపం: "ఓ గోవిందా! మా కోరికలన్నీ తీరేలా, నీతో కలిసి మేము సదా ఆనందించేలా, మా వ్రతం మంగళప్రదంగా పూర్తయ్యేలా మమ్మల్ని అనుగ్రహించు."

**ఆండాళ్ తిరువడిగళే శరణం**

**రచయిత: వై.ఎస్. యాదవ్, చైర్మన్, జై యాదవ్ జై మాధవ్ ట్రస్ట్.**

## "వార్తాప్రభ" క్యాలెండర్ ఆవిష్కరణ



**కూకట్ పల్లి,జనవరి 11(వార్తాప్రభ):**2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని "వార్తాప్రభ" దినపత్రిక క్యాలెండర్‌ను "వార్తా ప్రభ కూకట్‌పల్లి జోన్ ఇంచార్జు రాజు యాదవ్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి నిజమైన సమాచారం అందించడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. వార్తాపత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికల బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొంటూ"వార్తా ప్రభ" దినపత్రిక మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ నాయకులు దుర్గా ప్రసాదరావు, ప్రశాంత్ రావు, చంద్ర ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కారు బీభత్సం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం.



**మచిలీపట్నం జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సంక్రాంతి పండుగ సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుండి మచిలీపట్నం స్వగ్రామం కు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుండి మచిలీపట్నం చిలకలపూడి ప్రాంతానికి వస్తున్న ఐ20 కార్ బీభత్సం సృష్టించింది. డీ మార్ట్ నుండి లక్ష్మీ టాకీస్ సెంటర్ వైపుగా ఓవర్ స్పీడ్ తో వస్తున్న కారు పక్కనే ఉన్న ఫ్లాట్ బండి ఢీ కొట్టి స్తంభానికి డాష్ ఇచ్చాడు. దీనితో ఫ్లాట్ బండి పూర్తిగా ధ్వంసం అయింది. కారు ముందు భాగం స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో పాక్షికంగా ధ్వంసం అయింది. ఈ ఘటన తెల్లవారుజామున 4:00 గంటలకు జరిగింది. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ పూటుగా మద్యం సేవించి వాహనాన్ని నడిపినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోజుకో పార్టీ మారేది మీరు మేము కాదు



తిరువూరు,జనవరి 12 (వార్తాప్రభ) : తిరువూరు తెలుగుదేశం పార్టీ మండల పట్టణ కార్యాలయంలో విలేఖల సమావేశంలో నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి అలవాల రమేష్ రెడ్డి మాట్లాడుతూ నిన్న రేపూడి గ్రామం దేవాలయం కళా వేదిక ప్రారంభోత్సవానికి వచ్చిన ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడిన మాటలను ఖండించారు అవినాష్ మా గ్రామం వచ్చి ఏం మాట్లాడుతున్నావు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా నేను అడుగుతున్న అభివృద్ధి జరిగింది మా పార్టీతోనే ఐదు సంవత్సరాలు మీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎక్కడ సిసి రోడ్డు నిర్మాణం జరగలేదు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం జరిగాయి నీవు స్వామి దాస్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు ప్రజలు సంతోషంగా ఉన్నారు కానీ మీరిద్దరు సంతోషంగా లేరు ఒకప్పుడు తెలుగుదేశం తర్వాత కాంగ్రెస్ మరలా తెలుగుదేశం మరలా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్టీలు మారింది మీరు గత 30 సంవత్సరాలుగా నేను తెలుగుదేశం పార్టీలో ఉన్నాను మీరు అనేక పార్టీలు మారి ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఎందుకు పార్టీ మారావా అని మీరు సంతోషంగా లేరు అవాకులు చవాకులు మీ నోటి నుండి వస్తే తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు

## అన్న క్యాంటీన్ల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- ఇంచార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



కాకినాడ,జనవరి 12 (వార్తాప్రభ) : అన్న క్యాంటీన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ నిర్వాహకులను ఆదేశించారు. ఆయన డైరీ ఫారం సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో టోకెన్ జారీ విధానం,కౌంటర్ నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలను పలకరించి, వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు.క్యాంటీన్ నిర్వహణ పట్ల ప్రజలు వ్యక్తం చేసిన సంతృప్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఐదు రూపాయలకే వేడివేడిగా,నాణ్యమైన ఆహారాన్ని రోజుకు మూడు పూటలా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, క్యాంటీన్‌కు వచ్చే వారిని పలకరిస్తే వారు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్,టిడిపి నగర అధ్యక్షులు,రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మల్లిపూడి వీరు,బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఒమ్మి బాలాజీ, నాయకులు తుమ్మల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కొలికపూడి



గంపలగూడెం,జనవరి 12 (వార్తాప్రభ) : గంపలగూడెం మండలం గాదే వారి గ్రామంలో సిసి రోడ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు రెండు రోజులు ముందుగానే గాదెవారి గ్రామంలో సంక్రాంతి సంబరాలు చేసుకునేలాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు సీసీ రోడ్లకు నిధుల మంజూరు చేసి పండగ వాతావరణం ఈ గ్రామానికి తీసుకొచ్చారు ఈ గ్రామంలో ప్రతి రోడ్డు సిసి రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే తెలియజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచి చెన్న శ్రీనివాసరావు జనసేన నాయకులు పాల్గొన్నారు

## వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ చాణిక్య

కోడూరు- అవనిగడ్డ రహదారిలో రేడియం స్టిక్కర్ల డ్రమ్ములు ఏర్పాటు



కోడూరు,జనవరి 12 (వార్తాప్రభ) : వాహనదారులు ప్రయాణ సమయాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాల్సిందిగా కోడూరు ఎస్ఐ చాణిక్య కోరారు. సోమవారం కోడూరు మండల పరిధిలోని మాచవరం, తుంగ పల్లెమ్మ ఆలయం వద్ద, వి కొత్త పాలెం గ్రామాల వద్ద రహదారిపై రేడియం స్టిక్కర్ల డ్రమ్ములు ఏర్పాటు చేశారు. కోడూరు – అవనిగడ్డ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, వాహనాల వేగ నియంత్రణకు ఇవి ఏర్పాటు చేశామన్నారు. రాత్రి సమయాలలో వాహనదారులు వేగాన్ని తగ్గించి అప్రమత్తంగా ఉండి ప్రమాదాల బారిన పడకుండా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఐ తెలిపారు.

# ఎన్జీవోస్ అసోసియేషన్ -2026 క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ,జనవరి 12 (వార్తాప్రభ) : సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా సాగుతున్న రాష్ట్రానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అండగా నిలవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. ఎన్జీవో అసోసియేషన్ గుడివాడ తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను రాజేంద్రనగర్ లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమ వారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్జీవో నేతలతో కొద్దిసేపు ఎమ్మెల్యే రాము మాట్లాడారు. గుడివాడలో అభివృద్ధి పనుల పై ప్రజలనుండి మంచి స్పందన వస్తుందని ఎమ్మెల్యేతో ఉద్యోగులు అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను అన్ని విధాలుగా సహకరిస్తానని, ఐక్యంగా ముందుకు సాగుతూ ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజల మంచి కోసం ఉద్యోగ వర్గాలు చేసే అన్ని కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందనీ ఉద్యోగులతో ఎమ్మెల్యే రాము అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ అసోసియేషన్ గుడివాడ అధ్యక్షులు కేపీ రావు, ప్రధాన కార్యదర్శి జి. రాజేంద్రప్రసాద్, అసోసియేషన్ నాయకులు పి వి ఆర్ వి ప్రసాద్, బి వై విష్ణు ప్రసాద్, ఎం విద్యావతి, కే మహేష్, ఎంవి శ్రీనివాస్, డి జ్వాలా కిరణ్, డి విక్టర్ బాబు, పాపయ్య, వెంకటాద్రి, మనోజ్, రాము, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు





గుడివాడ,జనవరి 12 (వార్తాప్రభ) : వివేకానంద జీవితం యువతకు మార్గదర్శకమని బిజెపి మచిలీపట్నం పార్లమెంటు కన్వీనర్ సూరే లక్ష్మీనారాయణ (గాంధీ) అన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక నెహ్రూ చౌక్ లోని వివేకానంద విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిజెపి గుడివాడ పట్టణ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూరే గాంధీ మాట్లాడుతూ ఇప్పుడున్న యాంత్రిక జీవితంలో యువత సరైన అవకాశాలను అందుపుచ్చుకోవాలని చదువుకు ఉద్యోగం మాత్రమే కొలమానం కాదని అనేక రంగాలలో నిష్ణాత్తుగా ఎదగవచ్చని ప్రపంచంలో భారత్ దేశానికి ఉన్న అవున్నత్యాన్ని ముఖ్యంగా యువత గుర్తుతెరగాలని తద్వారా ప్రపంచంలో భారతదేశం విశ్వ గురువుగా ఎదగడానికి యువత నడుంబిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, మహిళా మోర్చ నాయకురాలు బోనం గోపిక, కొత్త వెంకట చలపతి, మాకాని జనార్ధన్ తదితరులు పాల్గొని స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.

**భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో.. :** భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రు చౌక్ సెంటర్ నందు గల స్వామి వివేకానంద విగ్రహం దగ్గర, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించి, వారిని యువత ఆదర్శంగా తీసుకొని, వ్యక్తిత్వ వికాసంతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు తిరుమలశెట్టి హారిక, కార్యదర్శి ఆదిరాజు వెంకటేశ్వర రావు, కోశాధికారి ఆర్.వి. వి. ప్రసాద్, యోగా ప్రోగ్రామ్స్ కన్వీనర్ చందన లీలా శ్రీనివాస రావు, సౌత్ రీజియన్ ఆడిటర్ పి.ఎల్.వి. సుబ్రహ్మణ్యం, సౌత్ రీజియన్ సేవా విభాగం కన్వీనర్ రూప్ చంద్ జైన్, చోడవరపు విజయ్ కుమార్, కెడి ఎన్ శ్రీనివాస్, పినపాల చంద్రశేఖర్, ముళ్ళపూడి రమణ మూర్తి, గుల్లిపల్లి కిరణ్ బాబు, నల్లూరి శేషగిరి రావు, సనకా సుబ్బారావు, అర్జా ప్రసాద్, తిరుపాల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్లో వచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారించాలని బిజెపి వినతి



కాకినాడ,జనవరి 12 (వార్తాప్రభ) : జిల్లావ్యాప్తంగా ప్రజలు పలుమార్లు సమస్యలను పరిష్కారం కోరుతూ ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే పిజిఆర్ఎస్లో ఇచ్చే ప్రతి ఫిర్యాదుపై స్పందించాలని జిల్లా బీజేపీ నాయకత్వం కోరింది. సోమవారం బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జనతా వారధి కార్యక్రమం కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు, ప్రత్తిపాడు నియోజకవర్గ మిట్టిచింతల గ్రామస్తులు బీసీ కార్పొరేషన్లో కుట్టు మిషన్లు ట్రైనింగ్ అయ్యి ఆరు నెలలైనా ఇప్పటివరకు కుట్టు మిషన్లు ఇవ్వలేదని వారి దృష్టికి తీసుకువచ్చారు. కుట్టు మిషన్లు, ట్రైనింగ్ టీచర్ల జీతాలు ఇప్పించినచో వాటి మీద జీవనోద్ధరణ చేసుకుంటామని వారికి చెప్పారు. తమ మహిళలకు ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నవని అర్జీదారుల సమస్యలు తీసుకుని వాటి సత్వర పరిష్కారానికి అధికారులతో మాట్లాడి కృషి చేస్తామని వారికి తెలియజేస్తూ కలెక్టరేట్లో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శిలు చోడిశెట్టి రమేష్ బాబు, కుండల సాయికుమార్, శంకర్ సింగ్, యార్లగడ్డ రామ్ కుమార్, పెండం శ్రీదేవి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు బుజ్జి, చెక్క రమేష్ , దొడ్డి వీరేంద్ర, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఘంటసాల గోవింద్, కర్రి సత్యనారాయణ రాజు జిల్లా పదాధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంగవల్లుల పోటీలకు రానున్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి



విస్సన్నపేట,జనవరి 12 (వార్తాప్రభ) : స్థానిక మండలంలోని విసన్నపేట, తాత కుంట్ల గ్రామంలో రంగవల్లుల కార్యక్రమాలకు మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి రానున్నట్లు నిర్వాహకులు తెలియజేస్తున్నారు. తాత కుంట్ల గ్రామంలో నెక్కలపు శ్రీనివాసరావు అలియాస్ ధాబా శ్రీను, డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు, తుమ్మలపల్లి అనిల్, ధమాలపాటి సాంబశివరావు, పలగాని మాధవరావు, రెడ్డి వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ రంజిత్ ఆకుల రాధాకృష్ణ, కుమార్, కాజా శ్రీనివాసరావు, రెడ్డి శేషగిరిరావు తదితరులు ప్రాంగణాన్ని పర్యవేక్షించారు. విస్సన్నపేట మండల కేంద్రంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు, బిజెపి జిల్లా నాయకులు గుత్తా శివ సుబ్రహ్మణ్యం, మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగంటి సత్యనారాయణ చౌదరి (నాని), తిరువూరు ఏఎంసీ డైరెక్టర్ పల్లెపాం రాంబాబు, కమతం సురేష్ తదితరుల సారాధ్యంలో తెలుగింటి ఆడపడుచులకు ముగ్గుల పోటీ నిర్వహించనున్నారు.

## నిర్దేశించిన వేగం తో ప్రమాదాలు నివారించవచ్చు



కాకినాడ,జనవరి 12 (వార్తాప్రభ) : వాహనదారులు నిర్దేశించిన వేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు తగ్గించవచ్చునని కాకినాడ రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు గౌరీ శంకర్, శ్వేత సాయి పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో కాకినాడలో జాతీయ రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా హెల్మెట్ వినియోగం, డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత, అలాగే పర్యారణ పరిరక్షణ,వాయు కాలుష్య నియంత్రణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని,చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,ద్వారా పరిమితికి లోబడి వాహనాలు నడపడం వలన ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా వాహనాల వల్ల కలిగే వాయు కాలుష్యం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తోందని, కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఏఎంవీఐ గౌరి శంకర్, శ్వేత సాయి పాల్గొని, రోడ్డు భద్రత నిబంధనల పై ప్రజలకు విలువైన సూచనలు అందించారు. ప్రమాద రహిత ప్రయాణం కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వారు పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## సాంప్రదాయ సంక్రాంతి ముద్దు కోడి పందెం జోదాలు వద్దు : ఎస్సై వెంకటేశ్వరరావు



రౌతులపూడి,జనవరి 12 (వార్తాప్రభ) : రౌతులపూడి మండల పరిధి గ్రామాలలో కోడి పందేలు నిర్వహించే వారికి కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేశ్వరావు హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు,జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిషేధించబడిన చట్ట విరుద్ధమైన ఏ జూద క్రీడలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. కోడిపందేలు నిర్వాహకులు,పాల్గొనేవారు, ప్రోత్సహించేవారు, భూమి యజమానులు,పందెం వేసేవారు,మద్యం విక్రేతలకు చట్ట ప్రకారం ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలకు లోనవుతారని హెచ్చరికలు జారి చేసారు.

## భక్తి ప్రవత్తులతో కూడార్రై మహోత్సవం



గుడివాడ,జనవరి 12 (వార్తాప్రభ) : స్థానిక పాటిమీద జగన్నాధపురం లో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక ధనుర్మాస మహోత్సవములలో భాగముగా ఆదివారం కూడార్రై మహోత్సవం సందర్భంగా 108 గంగాలములలో పాయాస ప్రసాదంతో శ్రీ స్వామి అమ్మవార్లకు అత్యంత వైభవం గా వేదమంత్రోచరణ ద్వారా ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించబడినవి. ఈ సందర్భంగా అప్పలాచార్యులు మనవడి పేరు మీద భక్తులు అందరికీ కూడా రవి ప్రసాదంతో కూడిన గంగాలములను వితరణగా అందజేసియున్నారు. ఈ కుడార్రై కార్యక్రమంలో ధనుర్మాస కళ్యాణ కర్తలైనటువంటి చలసాని సౌరీ రాజన్ పెరుమాళ్ల దంపతులు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం రామ ప్రసాద్ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు గోష్టి సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు..

● వాసవి జాగృతి క్లబ్ గుడివాడ వారిచే 7వ జత నేత్రాల సేకరణ..



గుడివాడ,జనవరి 12 (వార్తాప్రభ) : స్థానిక ధనియాల పేటలో నివాసముంటున్న చందులూరి రమేష్ కుమార్ (67 సం॥) సోమవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. ఆర్యవైశ్య కల్యాణ మందిర అధ్యక్షులు పోకూరి మోహన రావు ద్వారా వార్త తెలుసుకొన్న క్లబ్ అధ్యక్షులు చనిపోయిన వ్యక్తి భార్య వెంకట ధనలక్ష్మి అనుమతితో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నీషియన్ సాయి ద్వారా కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదాన ప్రోత్సాహకులు గాదె మోహన్ బాబు మాట్లాడుతూ ఈరోజు సేకరించిన నేత్రాల ద్వారా మరో ఇరువురికి చూపుని ప్రసాదించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్, ఎల్ వి ప్రసాద్ హాస్పటల్ సర్టిఫికెట్ అందజేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు చలువాది మోహన్ రావు, శ్రీకర కోపరేటివ్ బ్యాంకు సుగ్రీవు విజయభాస్కర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి అనిల్ సన్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా రోటరీ సంక్రాంతి సంబరాలు..




గుడివాడ,జనవరి 12 (వార్తాప్రభ) :స్థానిక జి. వి. పూర్ణ చంద్ర రావు కమ్యూనిటీ హాలు నందు రోటరీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అత్యంత ఉత్సాహభరితంగా సంప్రదాయ బద్ధంగా ముగిశాయి. రోటరీ కుటుంబ సభ్యులు ఆదివారం రోజున ఈ సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత శనివారం సాయంత్రం రోటరీ కుటుంబ ఆడపడుచుల కోసం నిర్వహించిన రంగవల్లి (ముగ్గుల) పోటీలు అందరినీ ఆకట్టుకుని, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించాయి. కుటుంబ సభ్యులంతా పాల్గొని భోగి మంటల చుట్టూ ఆనందంగా సంబరాలు చేసుకొని, అనంతరం నిర్వహించిన ఫోటో సెషన్ లో జ్ఞాపకాలను స్మరణీయంగా నిలుపుకున్నారు. తదుపరి గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు కీర్తనలు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించాయి. కోలాటం ప్రదర్శన ప్రేక్షకులను అలరించగా, పిల్లల కోసం నిర్వహించిన భోగిపళ్ళు, ఆటలు చిన్నారుల్లో అపారమైన ఆనందాన్ని నింపాయి. అదేవిధంగా సంప్రదాయ వినోదంగా నిర్వహించిన కోడి పందెముల ప్రదర్శన, మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆటలు కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని జోడించాయి. చివరగా అందరికీ ఏర్పాటు చేసిన సామూహిక భోజనం తో ఈ సంక్రాంతి సంబరాలు ముగిశాయి.

## మానవ సేవే.. మాధవ సేవ..



గుడివాడ,జనవరి 12 (వార్తాప్రభ) : సోమవారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సేవా మూర్తులు శ్రీకృష్ణ ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ పల్లపోతు వెంకట నాగబాబు పుట్టినరోజు సందర్భంగా ఏలూరు రోడ్ లోని కర్ల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం మరియు చీరలు పంచెలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రోహిబిషన్ & ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి హేమ సుస్మిత, అగ్రికల్చర్ ఎంఏఓ బి. అనంతలక్ష్మి లు విచ్చేసి అన్నదానం మరియు చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, నల్లం శ్రీనివాసరావు, పుట్టి వెంకటేశ్వరావు, జాజుల తాతారావు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ కె. సాయిరాం, హెడ్ కానిస్టేబుల్ పి పుష్ప, కె. మణికంఠ, కర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ ఇన్స్పెక్టర్ గోపాల కృష్ణ కు అభినందనలు



కాకినాడ,జనవరి 12 (వార్తాప్రభ) : వివేకానంద జయంతి సందర్భంగా కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రక్త దాన కార్యక్రమం నిర్వహించారు.జీజీహెచ్ లో హెల్త్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ. గోపాలకృష్ణ రక్తదానం చేశారు.ఈ సందర్భంగా గోపాల కృష్ణ ను ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సి ఎస్ ఆర్ ఎమ్ ఒ.కోమలి, మెహెర్, సిబ్బంది తదితరులు అభినందించారు.



గుడివాడ పట్టణ సీనియర్ పాత్రికేయులు నందిగం పండుబాబు జన్మదినోత్సవం సందర్భంగా గుడివాడ పట్టణ పాత్రికేయుల కార్యాలయంలో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. ! జనసేన నాయకులు సందు పవన్ లు ఈ సందర్భంగా పాత్రికేయులు ఏర్పాటుచేసిన కేకును కట్ చేసి పండు బాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

–గుడివాడ,జనవరి 12 (వార్తాప్రభ) :

# ఒడిస్సా గవర్నర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నేతలు



**విజయవాడ లీగల్,జనవరి 12 (వార్తాప్రభ) :** విజయవాడ పుస్తక ప్రదర్శన మహోత్సవ సందర్భంగా విచ్చేసిన ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ డా. కంభంపాటి హరిబాబు బెజవాడ బార్ సీనియర్ న్యాయవాది మరియు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి అయిన గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ స్వగృహానికి తేనీటి విందుకు హాజరైన సందర్భంగా బెజవాడ బార్ అధ్యక్షులు ఏకే భాషా, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ న్యాయవాద సంఘ అధ్యక్షులు ఎం సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది అయినటువంటి కొంగర సాయి మరియు ఇతర న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. బెజవాడ న్యాయవాదులు అందరి తరుపున గవర్నర్ కి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం డైరీ క్యాలండర్ ను బహుకరించి, విజయవాడ న్యాయవాదుల సంక్రాంతి ఉత్సవమునకు ఆహ్వానించారు. బెజవాడ బార్ ఆహ్వానాన్ని మన్నిస్తూ ఆంధ్రప్రదేశ్ లోని అత్యంత చైతన్యవంతం కలిగిన ప్రతిష్టాత్మకమైన, ఎప్పుడు న్యాయం తరుపున నిలబడే బార్ అసోసియేషన్ కు తప్పక విచ్చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ బెజవాడ న్యాయవాదులు అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు.

# ఘనంగా సోమేశ్వర జాతర పూజా కార్యక్రమంలో పాల్గొన్న బి. సి.నేత భేరి రామచంద్ర యాదవ్





**పఠాన్ చెరువు,జనవరి 12 (వార్తాప్రభ) :** సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరువు నియోజకవర్గం, రాంచంద్రాపురం సండే మార్కెట్ పక్కన ఉన్న సోమేశ్వర ఆలయంలో సోమేశ్వర జాతర ఒగ్గు కళాకారులు ఘనంగా పూజలు నిర్వహించారు. సోమేశ్వర స్వామి కరుణ కటాక్షాలు ప్రజల అందరి మీద ఉండాలని స్వామిని వేడుకున్నారు. అందరూ ఐక్యమత్యంతో, సోదర భావంతో మంచి,ఉన్నత స్థాయిలో జీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాగం రమేష్ యాదవ్, ఉపాధ్యక్షులు బి నవీన్, వి కుమార్, బి సాయిలు ప్రధాన కార్యదర్శి, బి సోమేశ్వర్, శ్రావణ్, సంతోష్, యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సోమేశ్వర జాతర అంగరంగ వైభవంగా జాతర కార్యక్రమానికి బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సంగారెడ్డి జిల్లా విద్యావంతుల వేదిక అధ్యక్షులు డాక్టర్ పాండురంగారావు యాదవ్, రిపోర్టర్ శ్రీనివాస్ యాదవ్, బేరి చంద్రశేఖర్ యాదవ్, పెద్ద ఎత్తున తరలివచ్చిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు మహిళా సోదరులు యువజన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జాతర విజయవంతం చేశారు.

# యాదవ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక సహాయం..






**గిద్దలూరు,జనవరి 12 (వార్తాప్రభ) :** గిద్దలూరు పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నందు సోమవారం నాడు గిద్దలూరు నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు జింకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదర్శ విద్యాసంస్థల అధినేత తిమ్మయ్య యాదవ్, గిద్దలూరు చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య యాదవ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బైలడుగు బాలయ్య యాదవ్, వెంకటయ్య యాదవ్ లు హాజరయ్యారు. గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాలల్లో తల్లిదండ్రులు లేని 14 మంది యాదవ పేద విద్యార్థులను గుర్తించి ఒక్కొక్కరికి 6000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని దాతల సహకారంతో అందించడం జరిగింది . ఆర్థిక సహాయం చేసిన సంఘ నాయకులకు, యాదవ సోదరులకు సంఘం తరఫున అభినందనలు తెలిపారు. తదుపరి గిద్దలూరు నియోజకవర్గ యాదవ సంఘం క్యాలెండర్ ను బుడతా తిమ్మయ్య గారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. తిమ్మయ్య మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు నంద్యాల శ్రీనివాసులు యాదవ్, సంఘం ప్రధాన కార్యదర్శి నంద్యాల ఈశ్వరయ్య యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గురు ప్రసాద్ యాదవ్, సంఘం ఉపాధ్యక్షులు చక్రపాణి యాదవ్, డాక్టర్ మొర్రి. పిచ్చయ్య యాదవ్, ట్రెజరర్ కొత్తకోట పోలయ్య యాదవ్ , నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ వేల్పుల మహేంద్ర యాదవ్, మేకల శంకరయ్య యాదవ్, కొమరోలు మండల అధ్యక్షులు భూపన బోయిన రాజశేఖర్ యాదవ్, గిద్దలూరు మండల అధ్యక్షులు మీసాల గోపాల్ యాదవ, సంఘం నాయకులు గంగుల పోలరాజు యాదవ్, నరసింహులు యాదవ్, ఆవుల రాజు యాదవ్, సర్పంచ్ ఆవుల రాజగోపాల్ యాదవ్ ,రాచర్ల మండల అధ్యక్షులు దూదిపల్లి నరసింహులు యాదవ్,ఆరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు గవ్వల వెంకటేష్ యాదవ్, దండు శ్రీనివాస్, దామెర్ల శేఖర్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

# విద్యుత్ ఘాతంతో వరిగడ్డి లారీ దగ్ధం

- భయంతో పరుగులు తీసిన జనం
- కందులపాడు వద్ద విజయవాడ-విస్సన్నపేట ఆర్ అండ్ బి రహదారిపై జరిగిన ఘటన
- మంటలు ఆర్పిన విజయవాడ ఫైర్ ఇంజన్ సిబ్బంది








**జి.కొండూరు,జనవరి 12 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని కందులపాడు గ్రామం వద్ద విజయవాడ–విస్సన్నపేట ఆర్ అండ్ బి రహదారిపై వరిగడ్డివాముతో వెళుతున్న లారీ సోమవారం దగ్ధమైంది.వెల్లటూరు గ్రామం నుంచి అమరావతికి పశు గ్రాసం కోసం గడ్డివామును (ఏపి 39 విడి 0108 ఐసర్) లారీలో లోడ్ చేసి తీసుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కందులపాడు గ్రామ వద్ద విద్యుత్ తీగలు కిందికి ఉండటాన్ని గమనించని లారీ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో అగ్ని ప్రమాదం జరిగింది.ఈ ఘటనలో లారీ పక్కకు వరిగిపోయింది.లారీ వెనుక, ముందు క్యాబిన్ పూర్తిగా కాలిపోయింది.రహదారి వెంట కాలుతున్న గడ్డి పడిపోవడంతో ప్రయాణికులు పరుగులు తీశారు.లారీ ఆయిల్ ట్యాంక్ ఎక్కడ పేలిపోతుందోనని స్థానిక ప్రజలు భయపడి పోయారు.విజయవాడకు చెందిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు.

# యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి సేవాభావం నింపిన మహనీయుడు "స్వామి వివేకానంద"


- జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్


**హైదరాబాద్, జనవరి 12 (వార్తాప్రభ) :** స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో గర్వకారణమని బి.సి.,యాదవ సంఘ నాయకులు ముచర్ల పేర్కొన్నారు. స్వామి వివేకానంద యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావం నింపిన మహానేత అని ఆయన ఆలోచనలు, బోధనలు నేటి యువతకు మార్గదర్శకాలన్నారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్న మహానేత సందేశం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. యువత సాధికారతే రాష్ట్రం, దేశ అభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, యువత సమాజ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆంజనేయులు యాదవ్ కోరారు. జాతీయ ఐక్యత, సమగ్ర అభివృద్ధి దిశగా యువత అడుగులు వేయాలని ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్ ఆకాంక్షించారు.




# పూరగుట్ట వాగులో అక్రమంగా మట్టి తవ్వకాలు







**జి.కొండూరు,జనవరి 12 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండల పరిధిలోని గుర్రాజుపాలెం శివారు పూరగుట్ట వాగులో సోమవారం కొందరు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టారు.పూరగుట్ట వాగులో 5 అడుగుల లోతు పెట్టి మట్టి తరలిస్తున్నారు.వాగులో ఇలా విచ్చల విడిగా తవ్విన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి.కొందరు తమ స్వార్థం కోసం ఎలాంటి అనుమతులు లేకుండా జే సి బి పెట్టి ట్రాక్టర్ల ద్వారా పూరగుట్ట వాగు నుంచి మట్టి తరలిస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వేస్తుంటే రెవిన్యూ,సంబంధిత శాఖ అధికారు లకు తెలిసి కూడా తట్టించుకోక పోవడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి గుర్రాజుపాలెం గ్రామ పరిధిలో ని పూరగుట్ట వాగు లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన సిహెచ్ రామ్ కుమార్



**రౌతులపూడి /శంఖవరం,జనవరి 12 (వార్తాప్రభ) :** స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అన్నవరం లో క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిలుకూరు రాంకుమార్ హాజరై, విజేతలకు గిఫ్టులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని గుర్తుచేస్తూ రాంకుమార్ మాట్లాడుతూ యువత దేశానికి ఆదర్శప్రాయమని, దేశానికి వెన్నుముక యువతే,స్వామి వివేకానంద చాటి చెప్పిన మార్గంలోనే మీ జీవన విధానం ఉండాలి. క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం మీ లక్ష్యాలుగా మారాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామా క్రికెట్ విద్యార్థులు, అభిమానులు పాల్గొన్నారు.

# వేలాది మందికి వెలుగు చూపిన టార్చి బేరర్ మన కుమార్

**-ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్**



**విస్సన్నపేట,జనవరి 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కుమార్ కోచింగ్ సెంటర్ నందు గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని సంస్థ అధినేత కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ కమిషనర్ చావాలి సునీల్ మాట్లాడుతూ వేలాదిమంది జీవితాలలో వెలుగు చూపిన టార్చి బేరర్ మన కుమార్ అని ఆయన చెప్పారు. గెజిటెడ్ నాట్ గెజిటెడ్ అధికారులుగా గల్లీ నుండి ఢిల్లీ వరకు వేలాది ఉద్యోగాలు చేస్తున్న వారే కాకుండా దేశ విదేశాలలో కూడా విశిష్టమైన స్థానాలలో ఎదిగేందుకు కుమార్ కోచింగ్ సెంటర్ వారధిగా ఉండటం సంతోషంగా ఉన్నది అన్నారు. విస్సన్నపేట మండలం వైద్యాధికారి కొప్పుల శ్రీనివాసరావు మాట్లాడుతూ కుమార్ మాస్టారు శిష్యుడు ను అని చెప్పారు. ఆయన శిక్షణాలోనే తాను విద్య నేర్చుకున్నానని ఆయన క్రమశిక్షణలో తాను ముందుకు వెళ్లానని చెప్పారు. నేడు ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న అలనాటి పలువురు విద్యార్థులు అలనాటి తరగతి గదులలోని సంగతులను గుర్తు చేసుకున్నారు. తన శిక్షణలో విద్యా వైద్య వాణిజ్య వైజ్ఞానిక సాకేతిక వ్యవసాయ రంగాలలో ఎదిగిన తమ విద్యార్థులను చూసి తమకు ఎంతో ఆనందంగా ఉన్నదని సంస్థ అధినేత కుమార్ చెప్పారు

# కిమ్స్ లో ఘనంగా జాతీయ యువజన దినోత్సవ వేడుకలు



**అమలాపురం,జనవరి 12 (వార్తాప్రభ) :** జాతీయ యువజన దినోత్సవం కిమ్స్ వైద్య కళాశాల లో ఘనంగా నిర్వహించినట్లు కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య తెలిపారు. హిందూ ధర్మ విశిష్టత ను, భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానంద జన్మ దినాన్ని పురస్కరించుకొని ఈ జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్నామని, వారి సిద్ధాంతాలను యువత స్ఫూర్తిగా తీసుకొని అనుసరించి జీవితంలో విజయం సాధించాలని డా.గోదాసి గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపల్లి సుబ్బరాయ శాస్త్రి,వివేకానంద స్వామి గురించి తమ ప్రసంగంతో ప్రేక్షకులను ఉత్తేజపరిచారు. మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. సుబ్బారావు మాట్లాడుతూ స్వామి వివేకానంద మత సామ–రస్యాన్ని ప్రబోధించారని, భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతం ద్వారా భారత దేశ ఐక్యత సాధించారని తెలిపారు. అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. అబ్దుల్ సలాం మాట్లాడుతూ వ్యక్తిగత,ఉద్యోగ సామాజిక బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే దేశ సేవ చేసినట్లే అని స్వామి వివేకానంద సూచించారని, యువత దీనిని గుర్తు పెట్టుకొని పాటించాలని తెలిపారు. కిమ్స్ వైస్ ప్రిన్సిపల్ డా. రేణు సులాఖే మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కోసం శారీరక ఆరోగ్యం చాలా అవసరం అని, ఈ రెండు సామాజిక ఆరోగ్య సాధనకు తప్పనిసరి అని స్వామి వివేకానంద సూచించారని, దానిని నేటి యువత తెలుసుకొని ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా వైద్య ఉపాధ్యాయులు, వైద్య విద్యార్థులు, వివేకానంద సేవా సమితి సభ్యులు, అమలాపురం రామకృష్ణ సమితి సభ్యులు పాల్గొన్నారు. ఇటువంటి స్ఫూర్తి దాయక కార్యక్రమ నిర్వాహకులను కిమ్స్ చైర్మన్ కె. వి. వి. సత్యనారాయణ రాజు, ఎం. డి. రవి కిరణ్ వర్మ, అభినందించారు.

# భారతదేశాన్ని విశ్వ గురు పీఠముపై నిలిపే బాధ్యత ఉపాధ్యాయులదే..

**-కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ ఏ.ఎం.డి. ఇంతియాజ్ ఐఏఎస్( రిటైర్డ్)**



**విజయవాడ,జనవరి 12 (వార్తాప్రభ) :** భారత దేశపు ఆధ్యాత్మిక శిఖరం స్వామి వివేకానంద అకాంక్షించిన విధంగా భారతదేశాన్ని విశ్వ గురు పీఠముపై నిలిపే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఉమ్మడి కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఏ.ఎం.డి ఇంతియాజ్ (రిటైర్డ్) అన్నారు. డెమొక్రటిక్ పి ఆర్ టి యు జాతీయ ఉపాధ్యాయ సేవాదళ సంయుక్త ఆధ్వర్యం లో నేడు విజయవాడ గాంధీ నగర్ రాష్ట్ర కార్యాలయంలో స్వామి వివేకానంద 163 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరుఐన ఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థుల్లో దేశభక్తి ని నైతిక విలువలు పెంపొందించే విధంగా జాతి నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమ సమన్వయకర్త జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ జాతీయ కన్వీనర్ డాక్టర్ డి శ్రీను మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని నైతిక విలువల తో పాటు భారతదేశ యొక్క ఔన్నత్యాన్ని తెలుసుకునే విధంగా అన్ని మున్సిపల్ పాఠశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ డిగ్రీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ను ఆహ్వానించి సెమినార్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సామాజిక సాంస్కృతిక రంగాలలో విశిష్ట సేవలు అందించిన యువతీ యువకులకు ఉపాధ్యాయులకు. మరియు ప్రతిభా వంతు లైన విద్యార్థుల ను అభినందిస్తూ వివేకానంద యూత్ డే అవార్డులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ టి యు విజయవాడ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈ వెంకట్ రెడ్డి సిహెచ్ వెంకట్రావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎం శిరీష నాగిని వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు. శారద రామక్రిష్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరాం ప్రసాద్ వారి సిబ్బంది తల్లి తండ్రి లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు సామాజిక సాంస్కృతిక రంగాలలో విశిష్ట సేవలు అందించిన యువతీ యువకులకు ఉపాధ్యాయులకు. మరియు ప్రతిభా వంతు లైన విద్యార్థుల ను అభినందిస్తూ వివేకానంద యూత్ డే అవార్డులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ టి యు విజయవాడ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈ వెంకట్ రెడ్డి సిహెచ్ వెంకట్రావు రాష్ట్ర మహిళా కార్యదర్శి. ఎం శిరీష నాగిని వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు. శారద రామక్రిష్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరాం ప్రసాద్ వారి సిబ్బంది తల్లి తండ్రి లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమాన్ జంక్షన్ ఆర్య వైశ్య సంగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



**హనుమాన్ జంక్షన్,జనవరి 12 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కపలవాయి భగవతి ఆధ్వర్యంలోవాసవి కళ్యాణ మండపంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులకి భోగి పళ్ళు సంధ్య గొబ్బెమ్మ పూజ ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పైడి సుధాకర్, కొనకళ్ళ రాజశేఖర్, చామర్తి రాంబాబు, కొనకళ్ళ ధనలక్ష్మి, మిట్టపల్లి పద్మ లలిత, ఇమ్మిడిశెట్టి భాగ్యలక్ష్మి , చలువాది రాజ్యలక్ష్మి , చామర్తి లోక్ నాథ్ ,వెచ్చా వెంకటేశ్వరరావు , తవ్వా నాగబాబు, నార్కేడమిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సచివాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. సీఎంతో పాటు సీఎస్ విజయానంద్ , మంత్రులు, అధికారులు వివేకానందకు నివాళులర్పించారు.
–అమరావతి, జనవరి 12 (వార్తాప్రభ) :

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

# శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



**నూజివీడు: జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు ఫ్యాషన్ డ్రెస్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపల్ జి శ్రీమన్నారాయణ, డీన్ కే సురేష్ బాబు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# నూజివీడులో రహదారి భద్రతపై అవగాహన



**నూజివీడు: జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూజివీడు ప్రాంతీయ రవాణా యూనిట్ కార్యాలయంలో 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా " శిక్షణతో భద్రత – సాంకేతికత ద్వారా పరివర్తన " అనే స్లోగన్ తో ఈ కార్యక్రమం ప్రారంభించబడినది. నూజివీడు ప్రాంతీయ రవాణా యూనిట్ కార్యాలయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు నూజివీడు పట్టణంలోని ప్రధాన కూడళ్లు వద్ద రోడ్డు భద్రత మాస ఉత్సవాల గురించి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది వాహన చోధకులు టు వీలర్ మరియు ఫోర్ వీలర్ నడిపే వ్యక్తులకు రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, రోడ్డు దాటేటప్పుడు ట్రాఫిక్ నిబంధనకు అనుగుణంగా వారు సూచించిన సైన్ బోర్డు లను గమనిస్తూ భద్రత విషయంలో జాగ్రత్త తీసుకోవాలని, ఈ రోడ్డు భద్రత విషయాలను వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి తెలుసుకొనటం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని, ప్రమాదరహిత రోడ్లుగా చూడవచ్చని ఇది మన అందరి బాధ్యతగా రహదారి భద్రత గురించి అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు మీద నడిచే పాదచారులకు, వాహనదారులకు, చాక్లెట్లను పంచి వారి భద్రత విషయాలను గురించి పూర్తి వివరణ తెలుపుతూ, రహదారి భద్రత మాస ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. రవాణా శాఖ వారు నిబంధనలను పాటించని వ్యక్తులకు చలానాలు వ్రాయడం జరిగినదనీ,కావున ప్రతి ఒక్కరు ఈ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

# లూమినాస్ ఫ్యామిలీ కార్నివాల్ కు రామచంద్రరావు ఎంపిక



**కిర్లంపూడి జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈనెల24,25,26 తేదీలలో హైదరాబాద్ నోవార్టిస్ హోటల్లో ప్రముఖ బ్యాటరీ సంస్థ లూమినాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఫ్యామిలీ కార్నివాల్ కు గుడియా రామచంద్రరావు ఫ్యామిలీ ఎంపికయింది. ఈ మేరకు ఆ సంస్థ సేల్స్ మేనేజర్ జు.రాము విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూమినోస్ సంస్థ తయారు చేసే వివిధ రకాల ఉత్పత్తుల విక్రయంలో ప్రత్యేక ప్రగతి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఎలక్ట్రికల్ వర్క్స్ అధినేత గుడియా రామచంద్రరావు సాధించారన్నారు. ఇదే ఉత్సాహంతో తమ సంస్థ యొక్క ఉత్పత్తులను భవిష్యత్తులో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తూ వారికి సకాలంలో సేవలు అందించాలన్నారు. సంస్థ తరపున రామచంద్రరావుకు మెమొంటో అందజేసి, దుస్సాలువతో ఘనంగా సన్మానించారు. ఈ నెలలో హైదరాబాదులో జరిగే లూమినాస్ ఫ్యామిలీ కార్నివాల్ కు సంబంధించిన ఆహ్వాన పత్రికను రామచంద్రరావుకు అందజేశారు. లూమినాస్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ సిహెచ్. రమేష్, సతీష్, దుర్గ, యామన సత్తిబాబు , బొండా కృష్ణ విరవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కూడారై శీరు గోవింద





**ప్రొద్దుటూరు, జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రొద్దుటూరు శ్రీకృష్ణ ఆలయం లో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ధనుర్మాసం 27వ రోజు కూడారై, పాశురాలలోని 27వ పాశురం ప్రత్యేక పాశురంగాను ప్రత్యేక రోజుగా, అండాలమ్మ గారికి ప్రత్యేకమైన దినము భావిస్తారు .ఈరోజు భక్తులు విరివిగా పాల్గొన్నారు. పాల్గొని పాయసం నెయ్యితో చేసిన పాయసాన్ని వండి చిన్నచిన్న 108 కుండలలో ఏర్పాటుచేసి ఆండాలమ్మ గారికి సమర్పించడం జరిగినది.కోలాట భజనలతో నృత్యాలతో స్వామి వారినిపూజించారు.తదనంతరము ఈ 108 కుండలలో ఏర్పాటు చేయబడిన పాయసం భక్తులందరికీ అందించడం జరిగినది. శ్రీకృష్ణాలయం యాదవ సేవా సంఘం అధ్యక్షుడైన దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్ దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు వచ్చిన భక్తులందరికీ ఉదయం ఫలహారాన్ని అందించారు.రిటైర్డ్ ఏఎస్ఐ బసయ్య దంపతులకు వ్యవస్థాపక అధ్యక్షుడు నాళీ కృష్ణారెడ్డి యాదవ్ దంపతులు, దాసరి బాల సుబ్బరాయుడు దంపతులు మరియు భక్తులు సన్మానం చేశారు.వారు ధనుర్మాసం మొత్తం రోజులు ప్రతిరోజు తిరుప్పావై పారాయణం చదువుతూ, చదివించుతూ ఉన్నారు.ఈ కార్యక్రమంలో పామిడి రామసుబ్బన్న యాదవ్, కార్యదర్శి ఆర్ వెంకటరమణ యాదవ్, కోశాధికారి ఆర్ వెంకటయ్య యాదవ్, ఉపాధ్యక్షులు కార్యవర్గ సభ్యులందరూ ,సంగటి రవీంద్ర యాదవ్ మొదలగు వారందరూ పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**కంకిపాడు/ పెనమలూరు జనవరి 12 (వార్త ప్రభ ప్రతినిధి)**మండల కేంద్రమైన కంకిపాడులో గుణదల డివిజన్ పరిధిలోని కంకిపాడు సెక్షన్ లో సోమవారం రోజున విద్యుత్ శాఖ విజిలెన్స్ మరియు ఆపరేషన్ అధికారులు 39బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 134 కేసులు నమోదు చేసి రూ.3.94 లక్షల అపరాదరుసుము విధించినాము.ఇందులో అధికంగా వాడుకుంటున్న విద్యుత్ లోడ్ తో పాటు ఒక కేటగిరీ నుండి ఇంకొక కేటగిరీకి వాడుకుంటున్న సర్వీస్లు అలాగే తక్కువగా బిల్లు అవుతున్న సర్వీస్ లు కూడా గుర్తించి క్రమబద్ధీకరించుకొనుటకు నోటీసులు జారీచేసినామని గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి హరిబాబు తెలిపారు. తనిఖీలకు ముందు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పి హరిబాబు మాట్లాడుతూ డివిజన్ లోని లైన్ మాన్ లు మరియు లైన్ ఇన్స్పెక్టర్స్ కు వారి యొక్క విధులు మరియు బాధ్యతలు గురించి, అలాగే ఫీల్డ్ లో లైన్ ల మీద పని చేయునపుడు తీసుకోవలసిన జాగర్తలు గురించి వివరించారు.ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. విజయ కుమారి , డిఈ బి.నవీన్ కుమార్, కానూరు, విజిలెన్స్ ఏఈ లు, డిఈ లు, గుణదల డివిజన్ ఏడిఈ లు, ఏఈ లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.విద్యుత్ చౌర్యం చేసినట్లుగా సమాచారం ఉంటే సంప్రదించవలసిన నెంబర్లు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.హరిబాబు (9493174266), లేదా విజిలెన్సు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.విజయకుమారి (8331020537) సమాచారం అందజేయాలని కోరారు. అందజేసిన వారి పేర్లు గోపియంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# అత్యంత ఉత్సహంగా స్వర్ణోత్సవ వేడుకలు

**అప్పనవీడు హైస్కూల్ 1975ఎస్ఎస్ సి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక**



**హనుమాన్ జంక్షన్, జనవరి 12 (వార్తాప్రభ)**స్నేహం అనేది మరచిపోలేని మధురానుభూతి స్నేహం అభిమానం దగ్గరైనప్పటికి ప్రేమ కూడా దీనిలో నిభిడీకృతమై ఉంది. లేకుంటే 50 సంవత్సరాల తర్వాత ఎవరైనా కలుస్తారా.ఎక్కడ1975 ఎక్కడ 2026 మధ్యలో 50 సంవత్సరాలు 5 దశాబ్దాలు గడిచిపోయాయి. హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ లోని అప్పనవీడు జిల్లా పరిషత్ హైస్కూల్ లో 1975–76 సంవత్సరంలో ఎస్ ఎస్ సి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ఆదివారం హనుమాన్ జంక్షన్ లో వీరంతా ఆనాటి విద్యార్థులలో ఒకరైన మొవ్వారమేష్ ఇంటివద్ద కలుసుకున్నారు. ఒకరిని ఒకరు ఆప్యాయత అనురాగం పంచుకున్నారు.అందరూ స్టేజి మీదకువచ్చి పరిచయం చేసుకున్నారు. నిజం చెప్పాలంటే కొందరిని మాత్రమే కొందరు గుర్తు పట్టగలరు. వారు చెపుతుంటే ఆనాడు మాట్లాడుకున్న మాటలు గుర్తుకొచ్చాయి.ఆనాటి తెలిసి తెలియని ప్రేమ ఎక్కడుందో ఏమైపోయిందో,ఆనాటి రూపంవేరు ఈనాటి రూపం వేరు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు.రాష్ట్రంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి రిటైర్ అయినవారే అందరూ అమ్మమ్మలు తాతయ్యలు అయ్యారు. వీరిలోఒకరికి ఆనాటి మిత్రులందరూ కలుసుకోవాలని ఆలోచన వచ్చింది.ఇంకొకరు ఆచరణలో పెట్టారు.ఇది కార్యరూపం దాల్చటానికి నెలో రెండునెలలో కాదు సంవత్సరాలు పట్టిందంటే నమ్మలేం. మిత్రుల్లో 10 మంది వరకు మరణించారు.ముందుగా వారందరికీ 2 నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఏలూరు రోడ్ లో ఉన్న అప్పనవీడు జిల్లా పరిషత్ హైస్కూల్ కు వెళ్లారు.ఆనాటి క్లాస్ రూమ్ లో కూర్చొని మధురానుభూతిని పొందారు.హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.ఆనాడు వీళ్లకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులందరూ గతిశీచిపోయారు. వారందరినీ గుర్తు చేసుకున్నారు.వీరందరూ కలుసుకున్న తీపిగుర్తుగా 43 మంది కలసి గ్రూప్ ఫోటో తీఇంచుకున్నారు. అనంతరం మొవ్వారమేష్ ఇంటి వద్ద పరిచయ కార్యక్రమం ప్రారంభమైంది.అందరికీ సన్మానాలు చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మొవ్వా రమేష్, పి.సోమయ్య, మరీదు వీరయ్య,మైనేని శోభన్ బాబు,కడియాల నాగమణి,ఆలపాటి రామ్ ప్రసాద్,వీరమాచినేని సత్యప్రసాద్,గరికపాటి వేంకటేశ్వరరావు,దుట్టా వేంకటేశ్వరరావు,డాక్టర్ దుట్టా శివశంకర్,తాతా వెంకట్రావ్, ఇశ్రాయెల్,ఏసుపాదం, విజయ కుమారి,స్వర్ణలత, జి.నాగమణి,సత్యవతి, విజయ లక్ష్మి,కరుణ కుమారి,మధు,శ్రీనివాస్ , సోభనాద్రి,రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, వేంకటేశ్వరరావు,సీతా కుమారి,మోగశీటి బేబీరావు,బొమ్మిశెట్టి రామారావు,మిర్జావలి, శరత్ బాబు,రామిశెట్టి వెంకట సత్యనారాయణ,బెజవాడ శ్రీరామమూర్తి, దండమూడిఅనురాధ, మంగతాయారు,వల్లభనేని ఝాన్సీ, తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి మూల కారకుడైన మొవ్వా రమేష్, దంపతులను సన్మానించారు.

# యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



**ఇబ్రహీంపట్నం, జనవరి 12 (వార్తా ప్రభ ప్రతినిధి):** యువతకు స్ఫూర్తినిచ్చే గొప్ప నాయకుడు స్వామి వివేకానంద అని బీజేపీ కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి సుధీష్ణ అన్నారు. కొండపల్లి బీజేపీ కార్యాలయంలో స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ భారతదేశ గొప్పతనాన్ని, వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. అందుకే ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కేవలం పుస్తక పరిజ్ఞానం కాకుండా వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, స్వతంత్ర ఆలోచనలే నిజమైన విద్య లక్ష్యమని ఆయన బోధించారన్నారు. నిరు పేదలకు సేవ చేయడమే భగవత్ సేవ అని నమ్మారన్నారు. యువతలో దేశభక్తి, ఆత్మగౌరవాన్ని పెంపొందించారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రఘునాథరెడ్డి, ప్రధాన కార్యదర్శులు యుగంధర్, భవాని, కో – ఆప్షన్ సభ్యురాలు నగీనా, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కృష్ణకుమారి, మూర్తి, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

# రంగుల మండపం వద్ద అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జనవరి 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పట్టణంలోని రంగుబజార్ ప్రాంతంలో ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మండపం వద్ద రంగులకై కొలువు దీరిన శ్రీ గోపయ్య స్వామి సమేత శ్రీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి దీక్షా స్వాములకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వాములకు అన్నదానం చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా అమ్మవారి మాల ధరించిన గురుస్వాములు రంగుల శ్రీను, వెంకన్న, నరసింహారావు, గోపి మాట్లాడుతూ, ఈ నెల 28వ తేదీ వరకు ఇక్కడ అన్నదాన కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు నాడు అంగన్వాడి డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, ఆలయ చైర్మన్ చుంచు రమేష్, కాకులపాటి కృష్ణమోహన్, ఆకుల శ్రీకాంత్, లాయర్ ఉమ, శివ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జనవరి 12 (వార్తప్రభ)** పట్టణంలో బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వామి వివేకానందుడు చెప్పిన సూక్తులు ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. దృఢ సంకల్పం, ఏకాగ్రత ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని తెలిపారు. యువత ప్రత్యేకంగా ఏకాగ్రతను అలవర్చుకోవాలని, ఏకాగ్రతతోనే జీవితంలో విజయాలను సాధించగలమని అన్నారు. ఏ పని చేసినా మొదటిసారే విజయం సాధించకపోతే నిరుత్సాహ పడకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తే తప్పకుండా విజయం లభిస్తుందని, అపజయం అనేది విజయానికి ఒక మెట్టు మాత్రమేనని పేర్కొన్నారు. అపజయాన్ని అనుభవంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు.అదేవిధంగా మహిళల పాత్రపై మాట్లాడుతూ, స్వామి వివేకానందుడు చెప్పినట్లుగా ఒక పక్షి రెండు రెక్కలతోనే ఎగరగలదని, ఒక రెక్కతో ఎగరలేనట్టే సమాజ అభివృద్ధికి మహిళలు కూడా సమానంగా చదువుకొని, శక్తివంతంగా ఎదగాలని అన్నారు. ప్రతి మహిళ చదువుతో, అవగాహనతో ముందుకు సాగితే కుటుంబం మాత్రమే కాకుండా సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.చివరగా స్వామి వివేకానంద సూక్తులను ప్రతి ఒక్కరూ జీవితంలో పాటిస్తూ మంచి మార్గంలో నడవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండ పట్టణ కౌన్సిలర్లు,మహిళలు మరియు ఇతర సిబ్బంది తెదేపా నాయకులు పాల్గొన్నారు.


## నాసిరకం రోడ్డు నిర్మాణ పనులతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు

**ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి**



**శేరిలింగంపల్లి,జనవరి 12 (వార్తాప్రభ)** :శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ లో శ్రీదేవి థియేటర్ అమీన్పూర్ రోడ్ ను చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా నవత రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ అలసత్వం ,అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేమి క్షుణ్ణంగా కనిపిస్తుందని,శ్రీదేవి థియేటర్ అమీన్పూర్ రోడ్ నాసిరకంతో నిర్మిస్తున్నరని,మట్టి తీయకుండా మొరం పోయకుండా పాత రోడ్డు మీదనే నాసిరకం డస్ట్ పోసి రోడ్డును నిర్మిస్తున్నరనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.నత్తనడక రోడ్డు పనుల వలన లక్షలాది మంది ప్రజలు,వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు,పాత రోడ్ తీయకుండానే, కొత్త రోడ్ వేయటం వలన రోడ్ కు ఇరువైపుల ఉన్న ఇల్లు గుంతల మయంగా మారుతున్నాయని,టీవీ చానెల్స్ వారి కెమెరాలు ఒక సారి శ్రీదేవి థియేటర్ అమీన్పూర్ రోడ్ వైపు చూపించాలని కోరారు,పత్రిక విలేకరుల సోదరులు ఒక్క సారి శ్రీదేవి థియేటర్ అమీన్పూర్ రోడ్ వైపు చూడాలని సూచన చేశారు.,రోడ్ నిర్మాణం,ప్రజల సౌకర్యం కోరకా? లేక ప్రజలను ఇబ్బంది పెట్టడం కోరకా?అని కాంట్రాక్టర్,అధికారులు ,ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వలన నరక యాతన పడుతున్న ఇంటి యజమానులు,వాహనదారులు అని,శ్రీదేవి థియేటర్ అమీన్పూర్ 150 ఫీట్లు రోడ్డుని అధికారుల పర్యవేక్షణలో,నాణ్యత తో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని శేరిలింగంపల్లి బీ.ఆర్.ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నా అన్నారు..ఈ కార్యక్రమంలో ఎం.డి సలీం,చందర్ రావు,గౌస్,రామా రావు,విజయ్,బాబా ,అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిల్పారామం లో రేపటి నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభం





**శేరిలింగంపల్లి,జనవరి 12 (వారా ప్రభ)**:మాదాపూర్ లోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు రేపటినుండి ప్రారంభమవుతున్నాయి.గంగిరెద్దులు,హరిదాసుల,బుడబుక్కల,జంగమదేవరులు పిట్టలదొర మొదలైన జానపద కళాకారులూ సందర్శకులకు నాలుగు రోజులు అందుబాటులో ఉంటారు.ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం యంపీ థియేటర్ లో ఏర్పాటు చేయడం జరిగాయి.13 జనవరి రోజున శ్రీ కళాకృష్ణ బృందం "స్వర నర్తనం", 14 జనవరి రోజున బోగి పండుగ పురస్కరించుకొని పదకొండు సంవత్సలు లోపు చిన్న పిల్లలకి "బోగి పళ్ళ " ఉత్సవం నిర్వహించడం జరుగుతుంది.ఆసక్తి గల వారు పిల్లలను తీసుకొచ్చి బోగి పళ్ళ ఉత్సవం లో పాల్గొనవచ్చు .తాడేపల్లి సుబ్బలక్ష్మి బృందం భోగి,సంక్రాంతి పాటలు ఆలపిస్తారు,రేణుక ప్రభాకర్ బృందం "గోదా కళ్యాణం" నృత్య రూపకం,పాతాళ భైరవి" సురభి నాటకం,15 జనవరి రోజున కుమారి ఆశ్రిత షిండే బృందం "గోదా కళ్యాణం" శ్రీ ఒగ్గు ప్రవీణ్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన,16 జనవరి రోజున గౌతమీ బృందం "గోదా కళ్యాణం" నృత్య రూపకం ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగాయి.సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సాయంత్రం ఆస్ట్రేలియా నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి కుమారి సిమ్రాన్ నాగరాజ నృత్య ప్రదర్శన మరియు బెంగళూరు నుండి విచ్చేసిన విద్వాన్ డాక్టర్ సాగర్ బృందం భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, నారాయణతేయ్ నమో నమో,బ్రహ్మమొక్కటే, శ్రీరామ నీ నామ,వేంకటాచల నిలయే,తిరుప్పావై,మొదలైన అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

# జగన్ పై వసంత వ్యాఖ్యలు అర్ధరహితం

**ఎమ్మెల్యే వసంత పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన వైఎస్ఆర్సిపి**



**ఇబ్రహీంపట్నం, జనవరి 12 (వార్తా ప్రభ ప్రతినిధి):** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కు లేదని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్ గృహంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. 2019 ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గం లో వైసీపీ శ్రేణులకష్టంతో వసంత కృష్ణప్రసాద్ ఎమ్మెల్యే అయ్యారని చెప్పారు. రెండు దశాబ్దాలుగా గెలుపు తెలియని వసంత జగన్ సీటు ఇస్తే కానీ గెలవలేకపోయారన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. నిజంగా అమరావతిపై చిత్తశుద్ధి ఉంటే 2022లో మూడు రాజధానులు అని ప్రకటించిన వెంటనే పార్టీకి ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. రాజధానికి వైసీపీ వ్యతిరేకం కాదని, రాజధాని పేరుతో చేస్తున్న దోపిడీని మాత్రం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. వై.ఎస్ జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని అంటున్న ఎమ్మెల్యే వసంత 2029లో టీడీపీ తరఫున మైలవరంలో పోటీ చేయాలని, అప్పుడు ఎవరు ఎవరిని తరిమి కొడతారో అర్థమవుతుందన్నారు.

# సైకోల్లా మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ నాయకులు

**కొండపల్లి పట్టణ టిడిపి నాయకుల విమర్శ**




**ఇబ్రహీంపట్నం, జనవరి 12(వార్తా ప్రభ ప్రతినిధి):** ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పై మాట్లాడుతున్న మాటలు సైకోల్లా ఉన్నాయని,వైఎస్ఆర్సిపి నాయకులు ఎమ్మెల్యే పై పిచ్చికుతలు మానుకోవాలని విమర్శించారు కొండపల్లి పట్టణ టిడిపి నాయకులు. కొండపల్లి టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విధ్వంసకర పాలన నచ్చక వైఎస్ఆర్సిపిని వీడి టిడిపిలో చేరి ప్రజా బలంతో భారీ విజయం సాధించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ను అర్థరహితంగా విమర్శించడం తగదని హెచ్చరించారు. అమరావతి పై నాడు వైఎస్ఆర్సిపి విషం చిమ్మి నేడు మొసలి కన్నీరు కారుస్తుందని దుయ్యబట్టారు. అమరావతి రాజధానికి మద్దతుగా నాడు ఎమ్మెల్యే ప్రశ్నించరన్నారు. నాటి విధ్వంసక పాలనను గుర్తు చేస్తూ విమర్శిస్తే వైఎస్ఆర్సిపి నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వారికి ఇంకా సిగ్గు రాలేదన్నారు. ఇలాగే సైకోలా మాట్లాడితే మరోసారి ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి చూడలేక కళ్ళు మూసుకుపోయి విమర్శలు చేస్తున్నారని, తమ నాయకుడు కల్తీ మద్యం కేసులో జైలు కెళ్ళిన సిగ్గు రాలేదని ఇప్పుడు నీతులు చెప్పడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# షేర్ మహమ్మద్ పేట గ్రామంలో ఘనంగా హిందూ సమ్మేళన కార్యక్రమం.



**జగ్గయ్యపేట జనవరి 12 (వార్తప్రభ)** మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని రాజా గోపాల స్వామి దేవాలయం లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామడుగు నరసింహ చార్యులు, రాష్ట్రీయ స్వయం సేవక్ శారీరక ప్రముఖ్ భీమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలనుండి హిందూ సోదరులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు.